

## ఆరోగ్య శాఖలో బదిలీల జాతర

- ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలో పనిచేసే 59 మంది వైద్యులకు స్థాన చలనం
- ఆర్డీ కార్యాలయ పరిధిలో 250 మందికి?
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో 100 మంది • 6లో

వైద్య, ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులు కదలనున్నారు. ఐదేళ్ల నిబంధనతో చాలామంది బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది.

### సుపరిపాలన ఘనం




ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి పాలనకు ఏడాది పూర్తవుతున్న తరుణంలో మహారాణిపేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో సంబరాలు చేసుకుంటూ బుధవారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు మహిళలు. ఈ విభాగం జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి తదితరులను చూడవచ్చు. -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

### జనసేన సంబరం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం జనసేన నాయకులు జగదాంబ కూడలిలో ఆ పార్టీ దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ సారథ్యంలో బాణసంచా కాలుస్తున్న దృశ్యం. ఈ సంబరాల్లో ఆ పార్టీ కార్పొరేటర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు. -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

### వైసీపీ వెన్నుపోటు దినం



ర్యాలీలో పాల్గొన్న కేకే రాజు, గొల్ల బాబూరావు, వరుదు కల్యాణి, వాసుపల్లి, అప్పారావు, తదితరులు

అధిష్ఠానం పిలుపు మేరకు బుధవారం జిల్లా వైసీపీ నేతలు కలెక్టరేట్ వద్ద 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు ముందుగా జిల్లా పరిషత్ కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

---

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల

## సమ్మె విరమణ

విశాఖపట్నం/ఉక్కు టౌన్‌షిప్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులను స్టీల్ ప్లాంటు యాజమాన్యం అకారణంగా విధుల్లో నుంచి తొలగిస్తున్నదని ఆరోపిస్తూ మే 20వ తేదీ నుంచి ప్రారంభించిన నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్టు బుధవారం అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు ప్రకటించాయి. ప్లాంటులో ప్రస్తుత పరిస్థితులు, మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని సమ్మెను విరమించుకుంటున్నామని పేర్కొన్నాయి. అయితే కాంట్రాక్టు కార్మికుల తొలగింపు విషయంలో పోరాటాలు చేస్తామని తెలిపాయి. ఈ నెల పదో తేదీన ఆర్ఎల్‌సీ సమక్షంలో జరగనున్న చర్చలకు ఉక్కు ఉన్నతాధికారులు హాజరై కార్మిక వర్గానికి మేలు చేయాలని కోరాయి.

**సమ్మె నిర్వీర్యానికి యాజమాన్యం కుట్ర**

నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో కాంట్రాక్ట్ ... మిగతా 6వ పేజీలో

# నగరం కాలుష్యమయం

### ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం

- పోర్టు నుంచి విపరీతంగా బొగ్గు ధూళి...
- ఇంకా పరిశ్రమలు, కాలంచెల్లిన వాహనాల నుంచి వచ్చే కాలుష్యమూ అధికమే
- పీఎం 10, పీఎం- 2.5 ఏడాది సగటు కంటే ఎక్కువగా నమోదు
- కోట్లు ఖర్చు పెట్టినా ఫలితం శూన్యం

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



పోర్టు రోడ్డులో దుమ్ము రేగుతున్న రహదారి

నగరంలో ఏడాది సగటు

| సంవత్సరం | పీఎం 10 | పీఎం 2.5 |
|---|---|---|
| 2019 | 106 | 48 |
| 2020 | 95 | 39 |
| 2021 | 108 | 44 |
| 2022 | 113 | 45 |
| 2023 | 134 | 51 |
| 2024 | 107.8 | 45.3 |

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో కాలుష్యం పెరుగుతూనే ఉంది. పోర్టులోని బొగ్గు, ఇతర సరుకుల నుంచి వచ్చే ధూళి, పరిసరాల్లోని పరిశ్రమలు విడిచిపెట్టే కాలుష్యంతో నగరవాసులకు ఊపిరాడడం లేదు. ఇంకా వాహన కాలుష్యం, భారీఎత్తున చేపట్టే నిర్మాణాల నుంచి వెలువడుతున్న ధూళి ఇబ్బందికరంగా పరిణమించాయి. దీనికితోడు వేల కిలోలీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారు. కాలుష్య నివారణకు విశాఖ పోర్టు, ఇతర పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా క్లీన్ విశాఖ సాధ్యపడడం లేదు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

ఒకప్పుడు వన్‌టౌన్, జ్ఞానాపురానికి పరిమితమైన కాలుష్యం ఇప్పుడు ఎంవీపీ కాలనీ వరకూ విస్తరించింది. గతానికంటే కాలుష్య తీవ్రత తగ్గిందని ప్రభుత్వ శాఖలు ముఖ్యంగా కాలుష్య నియంత్రణ మండలి ఎయిర్ క్వాలిటీ యంత్రాల ద్వారా వెల్లడవుతున్నా...పీఎం 10, పీఎం 2.5 విలువ ఏడాది సగటుకు మించి నమోదుకావడం ఆందోళనకు గురిచేస్తుంది. ధూళి కాలుష్యం దీర్ఘకాల రోగాలకు ప్రధాన కారణంగా మారుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. యునిసెఫ్ ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ గ్లోబాలీ' నినాదంతో కార్యాచరణ రూపొందించింది.

**తగ్గని పోర్టు బొగ్గు ధూళి**

విశాఖ పోర్టు నుంచి వచ్చే కాలుష్యంతో నగరంలోని అన్ని ప్రాంతాలు ఇబ్బందిపడుతున్నాయి. నౌకల ... మిగతా 6వ పేజీలో

---

# సర్వీస్ రోడ్డు ఆక్రమణ

### రహదారిపై కర్రలు, ఇంటి సామగ్రి... ఇంకా అనధికార పార్కింగ్

- వాహనాలు వెళ్లడానికి అవకాశం లేని పరిస్థితి
- ఇదీ వెంకోజీపాలెం వద్ద దుస్థితి
- జాతీయ రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీ
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు, జీవీఎంసీ



ఇదీ వెంకోజీపాలెం వద్ద సర్వీస్ రోడ్డు పరిస్థితి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**నగరంలో రోడ్లపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. వెంకోజీపాలెం కూడలి నుంచి ఇసుకతోట కూడలి వరకూ సర్వీస్ రోడ్డు పూర్తిగా ఆక్రమణలతో మూసుకుపోయింది. ఆ రోడ్డులో ప్రయాణించాల్సిన వాహనాలు జాతీయ రహదారి మీదుగా వెళుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.**

హనుమంతవాక వైపు నుంచి భారీసంఖ్యలో వాహనాలు జాతీయ రహదారిపై నగరంలోకి వస్తుంటాయి. సిగ్నల్ పాయింట్ల వద్ద పదుల సంఖ్యలో వాహనాలు బారులుతీరుతుంటాయి. జీవీఎంసీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా సమస్యను అధిగమించే అవకాశాలను చాలాకాలం కిందట పరిశీలించారు. ఈ క్రమంలోనే వెంకోజీపాలెం జంక్షన్ నుంచి ఇసుకతోట జంక్షన్ వరకూ సర్వీసురోడ్డు నిర్మించాలని జీవీఎంసీ అధికారులను పోలీసులు కోరారు. జీవీఎంసీ అధికారులు సమారు ఐదారేళ్ల కిందట జాతీయ రహదారిపై ఆక్రమణలను తొలగించి వెంకోజీపాలెం నుంచి ఇసుకతోట జంక్షన్ వరకూ సర్వీస్ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డును ద్విచక్ర వాహనాలు, ఆటోలకు కేటాయించడం వల్ల జాతీయ రహదారిపై ట్రాఫిక్ తగ్గడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని భావించారు. అయితే ఆ రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణాలు ఒక్కొక్కటిగా ఆక్రమించడం మొదలెట్టాయి. జీవీఎంసీ, పోలీస్ అధికారులు పట్టించుకోనట్టు వదిలేయడంతో సర్వీస్ రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురైంది. సర్వీస్ రోడ్డు పొడవునా పాత ఇంటి సామగ్రి, బీరువాల తయారీ, గ్రిల్స్ తయారీ సామగ్రి ... మిగతా 6వ పేజీలో

## రేపటి నుంచి డీఎస్సీ పరీక్షలు

**30వ తేదీ వరకూ నిర్వహణ**

- 57,895 మంది అభ్యర్థులు, 12 కేంద్రాలు : జాయింట్ కలెక్టర్

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల ఆరో తేదీ నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లాలోని 12 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. చైతన్య ఇంజనీరింగ్ కళాశాల (కొమ్మాది), ఎస్‌వీఎస్ టెక్నాలజీ సొల్యూషన్స్ (పెదగంట్యాడ) ఐయాన్ డిజిటల్స్ (షీలానగర్, చినముషిడివాడ), ఏడీజడ్ ఆర్వోనా డిజిటల్ (నియర్ ఎన్ఎస్‌టీఎల్), గాయత్రి విద్యాపరిషత్ (మధురవాడ, రుషికొండ), విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల (దువ్వాడ), ఎన్ఎస్ఆర్ఐటీ (శొంఠ్యాం), విట్స్ (నరవ)లో కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి 2.30 నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు రెండుపూటలా పరీక్షలు జరుగుతాయన్నారు. ఆయా కేంద్రాల్లో చిన్నపాటి లోపం తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షలకు మొత్తం 57,895 మంది దరఖాస్తు చేశారన్నారు. సమీక్షలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, ఆర్‌ఐవో మురళీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జోన్‌ల పునర్విభజన

**అసెంబ్లీ నియోజకవర్గమంతా ఒకే జోన్ పరిధిలోకి ఉండేలా చూడాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యేల విజ్ఞప్తి**

- ప్రతిపాదనలు తయారుచేస్తున్న జీవీఎంసీ అధికారులు
- కౌన్సిల్‌లో టేబుల్ అజెండాగా చేర్చాలని యోచన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని ఎనిమిది జోన్‌లను పునర్విభజన చేయాలని అధికారులు భావిస్తున్నారు. పాలనా సౌలభ్యం కోసం ఒక అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే జోన్‌లో ఉండేలా చూడాలని నగరానికి చెందిన ఎమ్మెల్యేలు కోరుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రతిపాదనలు తయారుచేసి కౌన్సిల్ ఆమోదానికి పెట్టాలని ఆదేశించింది. దీంతో జీవీఎంసీ అధికారులు జోన్‌ల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనల తయారీలో నిమగ్నమయ్యారు.**

జీవీఎంసీ పరిధిలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. తూర్పు, దక్షిణం, ఉత్తర, పశ్చిమ, గాజువాక నియోజకవర్గాలు పూర్తిగా, భీమిలి నియోజకవర్గంలో నాలుగు వార్డులు, అనకాపల్లి నియోజకవర్గం పరిధిలో ఐదు వార్డులు, పెందుర్తి నియోజకవర్గం పరిధిలో పది వార్డులు జీవీఎంసీ పరిధిలో ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం జీవీఎంసీ పరిధిలోని 98 వార్డులను ఎనిమిది జోన్‌లుగా విభజించి, ఒక్కో జోన్‌లో జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి జోన్ పరిధిలోని ప్రజలకు అవసరమైన సేవలు అందుతుంటాయి. అయితే ఒక జోన్ పరిధిలో మూడు, నాలుగు నియోజకవర్గాలకు చెందిన ప్రాంతాలు ఉండడంతో పాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు జోన్-5 (జ్ఞానాపురం)లో దక్షిణం, ఉత్తరం, పశ్చిమ, భీమిలి నియోజకవర్గాలకు చెందిన ప్రాంతాలు, జోన్-3 (ఆశీల్‌మెట్ట)లో తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల ప్రాంతాలు ఉన్నాయి. ఒక్క జోన్-7 (అనకాపల్లి), జోన్-1 (భీమిలి) మినహాయిస్తే మిగిలిన జోన్‌లలో రెండు, అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల ప్రాంతాలు ఉన్నాయి. దీనివల్ల అధికారులకు పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతోపాటు ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలోని సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించాలంటే రెండు, అంతకంటే ఎక్కువ జోన్‌ల అధికారులను పిలవాల్సి వస్తోంది. ఇది కొంత ఇబ్బందిగా ఉన్నందున తమ నియోజకవర్గాన్ని ఒకే జోన్ పరిధిలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ ... మిగతా 6వ పేజీలో


---

## డీజీపీ సుడిగాలి పర్యటన

- అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు పరిశీలన
- ప్రధాని పర్యటనకు భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం



బీచ్‌రోడ్డులో డీజీపీ కాన్వాయ్



విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్‌గుప్తా బుధవారం నగరంలో సుడిగాలి పర్యటన జరిపారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. 21న కోస్టల్ బ్యాటరీ జంక్షన్ నుంచి భీమిలి వరకూ బీచ్‌రోడ్డు పొడవునా, బీచ్‌రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్లపై సుమారు ఐదు లక్షల మంది యోగా చేయనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బీచ్‌రోడ్డుతోపాటు అనుసంధాన రోడ్లను, ఏయూ మైదానంతోపాటు హెలీపాడ్‌ను డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, ఆక్టోపస్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్, సీపీ శంఖబ్రతబాగ్చితోపాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. తర్వాత సీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విశాఖ రేంజ్ పరిధిలోని ఐపీఎస్ అధికారులు, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌తో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రత ఏర్పాటుచేయాలని, బీచ్‌రోడ్డులో ఎక్కడికక్కడ నిఘా పెట్టాలని సూచించారు. దీనికి సంబంధించి ఎవరు ఏ విధులను నిర్వర్తించాలనే దానిపై కూడా చర్చించినట్టు తెలిసింది.

## ఎట్టకేలకు యాత్రీనివాస్‌కు మోక్షం

- అదనపు ఖర్చుకు కేబినెట్ ఆమోదం
- త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం



అప్పుఘర్ వద్ద పర్యాటక శాఖ యాత్రీనివాస్ భవనం

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో పర్యాటకులకు ఆ శాఖ తరఫున ఒక గది కూడా లేకుండా చేసిన పాపాన్ని వైసీపీ ప్రభుత్వం మూటగట్టుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఆ లోపాన్ని కేబినెట్‌లో బుధవారం సరిచేసింది. పర్యాటక శాఖకు రుషికొండపై హరిత రిసార్ట్స్, ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ వద్ద యాత్రీనివాస్ ఉండేవి. రుషికొండపై రిసార్ట్స్‌ను కూలగొట్టి నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ.450 కోట్లతో రాజభవనం నిర్మించుకున్నారు. నిర్మాణం జరిగినంత కాలం అది పర్యాటకుల కోసమేనంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. పూర్తయ్యాక సీఎం నివాసం అన్నారు. దాంతో పర్యాటకులకు రుషికొండపై ఉండడానికి అవకాశం కొరవడింది. ఇక ఎంవీపీ కాలనీలోని యాత్రీనివాస్‌ను రూ.8 కోట్లతో ఆధునికీకరించడానికి ఆ ప్రభుత్వమే ఆమోదం తెలిపింది. పనులు చేపట్టిన తరువాత అంచనా వ్యయం పెరిగింది. అదనంగా మరో రూ.5.5 కోట్లు అవసరమని నాటి ఈఈ రమణ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అంత మొత్తం అయితే కొత్త భవనమే నిర్మించుకోవచ్చు కదా?...అంటూ ఉన్నతాధికారులు ఫైల్ పక్కన పెట్టేశారు. కొత్త ప్రభుత్వం వచ్చాక దానిపై అనేకసార్లు సమీక్షించింది. చివరికి అదనపు సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు మాత్రమే ఉపయోగించాలనే నిబంధనతో నిధులు ఇవ్వడానికి బుధవారం కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో అవన్నీ పూర్తిచేసి త్వరలో యాత్రీనివాస్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.



గరుడ వాహనంపై ఉన్న స్వామివారికి అర్చకుల ప్రత్యేక పూజలు

## అప్పన్నకు వైభవంగా గరుడసేవ

సింహాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గరుడ సేవ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాల పూజలు చేశారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

## తగరపువలసలో సమైక్యతా ర్యాలీ

తగరపువలస, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : దేశ సమగ్రతను కాపాడాలని కోరుతూ తగరపువలసలో సీపీఎం, సీఐటీయూ కార్యకర్తలు బుధవారం సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ పహల్గాంలో 25 మంది పర్యాటకులను ఉగ్రమూకలు కాల్చి చంపిన సంఘటన చాలా దారుణమన్నారు. దీన్ని దేశ ప్రజలంతా ఖండించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి. సూర్యనారాయణ, ఎస్. అప్పలనాయుడు, దామోదర బావాజీ, మగడ ఈశ్వరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

## రేషన్ డిపోలతో కార్డుదారులకు ఇబ్బందులు

తగరపువలస, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డిపోల ఏర్పాటు వల్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. బుధవారం వారు తగరపువలసలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొన్ని డిపోలు గ్రామాలకు చాలా దూరంగా ఉండడం వల్ల ప్రజలు సరకులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అలాగే కొందరు డీలర్లు అన్ని సరకులు ఒకేసారి ఇవ్వడం లేదని, దీని వల్ల కార్డుదారులు రెండు మూడుసార్లు తిరగవలసి వస్తోందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నూలు ఆదినారాయణ, మోర అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ భీమిలి మండల అధ్యక్షుడిగా 'గాడు'

భీమునిపట్నం (రూరల్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ భీమిలి మండల అధ్యక్షుడిగా లక్ష్మీపురం గ్రామానికి చెందిన గాడు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈమేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## సర్వీస్ రోడ్డు ఆక్రమణ

... 5వ పేజీ తరువాయి

పెట్టేశారు. మరోవైపు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల సర్వీస్ రోడ్డులో కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లే అవకాశం ఉండడం లేదు. దీంతో వాహనాలన్నీ జాతీయరహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. పాత వెంకోజీపాలెం వద్ద మలుపులో వాహనాలు అదుపుతప్పడం, అదేసమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ముందువెళ్లే వాహనాలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వారం రోజుల్లోనే రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీస్ అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై ఆక్రమణలను పూర్తిగా తొలగించడంతోపాటు పక్కనే ఉన్న దుకాణాలు రోడ్డుపైకి రాకుండా గ్రిల్స్‌ను ఏర్పాటుచేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.అలాచేస్తే జాతీయ రహదారిపై వాహనాల రద్దీ తగ్గుతుందని పేర్కొంటున్నారు.

## జోన్‌ల పునర్విభజన

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు ఇటీవల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎమ్మెల్యేల విజ్ఞప్తికి అనుగుణంగా జోన్‌ల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. జీవీఎంసీలో ఒక అదనపు కమిషనర్‌తోపాటు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కలిసి జోన్‌ల పునర్విభజనపై కసరత్తు ప్రారంభించారు. ఈనెల ఆరున జరిగే కౌన్సిల్ సమావేశంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనను టేబుల్ అజెండాగా చేర్చి చర్చించనున్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత తదుపరి చర్యలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలావుంటే జీవీఎంసీ పరిధిలోని జోన్‌ల పునర్విభజనపై తమకు కనీసం సమాచారం ఇవ్వలేదంటూ కొందరు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పునర్విభజన ఆలోచన మంచిదే కానీ తమ అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ప్రతిపాదనను కౌన్సిల్‌లో చర్చించేందుకు అజెండాలో చేర్చాలనే విషయాన్ని అధికారులు విస్మరించారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు అండగా ఉంటాం

- సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- రూ. 99 లక్షలతో పంట కాలువల పూడికతీత
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన గిడిజాల సమీపంలో గుడిలోవ ఛానల్ కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో కాలువల పూడికతీతకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. నియోజకవర్గంలో పంట కాలువల నిర్వహణ, పూడికతీతలకు రూ. 99. 95 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. గిడిజాల గ్రామం నీళ్ల కుండీల నుంచి మొదలై పెద్దిపాలెం దత్తపు చెరువు వరకు 11.50 కిలోమీటర్లు పొడవున విస్తరించి ఉన్న గుడిలోవ కాలువ 600 ఎకరాలకు నీరందిస్తుందన్నారు. ఏడేళ్ల తర్వాత కాలువ పూడికతీతలు జరుగుతున్నాయని చెప్పారు. 57 కిలోమీటర్ల పొడవున కాలువ పూడిక తీయడం వల్ల 4,130 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని వివరించారు. అనంతరం పూడికతీత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాట్రాజు అప్పారావు, బీఆర్‌బీ నాయుడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, మీసాల సత్యన్నారాయణ, శివాజీ, కోరాడ వైకుంఠరావు, కోరాడ రాము తదితరులు పాల్గొన్నారు.

### జన ఔషధి కేంద్రం ప్రారంభం

మండలంలోని పందలపాక సమీపంలో ఉన్న ఐటీబీపీ బెటాలియన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయన్నారు.వైద్యం ఖరీదైన ప్రస్తుత రోజుల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చాయని చెప్పారు.గ్రామాల్లో జన ఔషధ కేంద్రాల ద్వారా ఖరీదైన మందులు తక్కువ ధరకు అందిస్తున్నారన్నారు. పందలపాకలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఎస్‌జీటీల వినతి



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌జీటీలు

భీమునిపట్నం (రూరల్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో కొన్ని విధానాల వల్ల అనేక మంది సెకెండరీ గ్రేడ్ టీచర్లు పదోన్నతులు కోల్పోయారని, వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఉపాధ్యాయులు కోరారు. బుధవారం వారు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ప్రభుత్వం ఇటీవల స్కూల్ అసిస్టెంట్లకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా మార్పునకు అవకాశం కల్పించిందన్నారు. చాలామంది స్కూల్ అసిస్టెంట్లు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా మారిపోయారని తెలిపారు. దీనివల్ల గత 30 ఏళ్లుగా అన్ని అర్హతలతో ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న వేలాది మంది పదోన్నతుల అవకాశాన్ని కోల్పోయారని చెప్పారు. పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు ఏర్పాటు చేసినప్పుడు కేవలం ఎస్‌జీటీలకు మాత్రమే ఆ పోస్టులు ఉంటాయని ప్రకటించారని, కానీ కౌన్సెలింగ్‌లో స్కూల్ అసిస్టెంట్లు కూడా ఈ పోస్టుల్లో చేరిపోయారని, ఇది నిబంధనలకు విరుద్ధమని వివరించారు. ఎస్‌జీటీలకు మాత్రమే ఈ పోస్టులు దక్కేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. అరుణ్‌కుమార్, రామకృష్ణ, సర్వేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీధర్, శివ, రమణ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయం 10 గంటలకు కార్‌షెడ్ వద్ద నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

## నిర్మానుష్యంగా జాతీయ రహదారి

మధురవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండల ధాటికి మధురవాడ పరిసర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బయట పనులు ఉన్నవారు ఉదయం 10 గంటల్లోపు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుతున్నారు. ఉదయం 11 గంటల తరువాత రోడ్లు, వీధులు జన సంచారం లేక ఖాళీగా కనిపిస్తున్నాయి. సాయంత్రం వరకు వేడి గాలులు వీస్తుండడంతో తీవ్రమైన ఉక్కపోతకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి ఎండలు చూడలేదని పలువురు పేర్కొంటున్నారు.

## బీసీ వసతి గృహంలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

మధురవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వసతిగృహం సంక్షేమాధికారి ఎస్. రమేష్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్‌నగర్ పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి వరకు, చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారు వసతి గృహంలో ఉండవచ్చునని చెప్పారు. ఎస్సీ విద్యార్థులకు 115, ఎస్టీలకు 41, బీసీలకు 109, మైనర్టీ, ఇతర కులాలకు 44 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నేరుగా మధురవాడ వసతి గృహంలో సంప్రతించాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబరు 9154879173 సంప్రతించవచ్చునని సూచించారు.

## యోగాంధ్రపై శిక్షణ

మధురవాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ శిల్పారామంలో యోగాంధ్రపై జడ్సీ కనకమహాలక్ష్మి ఆధ్వ ర్యంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ ఈనెల 21న జరిగే అం తర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నగరంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమానికి జోన్-2 పరిధిలోని సచివాలయ సిబ్బందిని, ప్రజలను, ఔత్సాహికులను సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సింహాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) :అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహ సారథ్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు దేశ సమైక్యత అన్న అంశంపై బుధవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం రచయిత, కార్టూనిస్టు బి. హరి కార్టూన్లు ఎలా వేయాలో విద్యార్థులకు మెలకువలు నేర్పారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ విశాఖ కన్వీనర్ బస్సు పోతన, సామాజిక కార్యకర్త నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

## త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ప్రబోధ సేవా సమితి విజయనగరం ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీతపై బుధవారం ప్రచారం నిర్వహించారు. రెడ్డిపల్లి, పొట్నూరు, నర్సాపురం గ్రామాల్లో పర్యటించి, త్రైత సిద్ధాంత భగవద్గీత, జ్ఞాన గ్రంథాలపై ప్రచారం చేసి, శ్రీకృష్ణుడు ప్రవచించిన విశేషాలను తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వి. శంకరరావు, ప్రసాద్, వంశీ, రాజేశ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బంగారమ్మ పండగ

పద్మనాభం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని బంగారమ్మ పండగ బుధవారం కనుమతో ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పండగ ప్రశాంతంగా జరగడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పైడితల్లమ్మ వార్షిక పండగ ప్రారంభం



తిరువీధిలో ఆలయ పూజారి

సింహాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి,అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ వార్షిక పండగ బుధవారం సాయంత్రం జోగి తిరువీధితో ప్రారంభమైంది. ఆలయ పూజారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గరగ పట్టుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరిగారు. గ్రామస్తులు అమ్మవారికి జోగి వేసి, పసుపు కుంకుమ సమర్పించి నీరాజనాలిచ్చారు. రాత్రి గరగలతో అమ్మవారి శతకం పట్టు నుంచి గ్రామం అంతటా తిరిగి భక్తులు సమర్పించిన ఫలాలు స్వీకరించారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

సింహాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలగడంతో పాటు యువతలో సమైక్యతా భావం పెరుగుతుందని టీడీపీ యువనేత గంటా రవితేజ అన్నారు. పైడితల్లమ్మ వార్షిక పండగ సందర్భంగా 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం సారథ్యంలో నిర్వహిస్తున్న కార్పొరేటర్ క్రికెట్ కప్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో 48 జట్లు పాల్గొంటున్నాయని, విజేతలకు ప్రధాన పండగ రోజున బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు శిరిపురపు సురేష్, పట్నాల ధర్మరాజు, రాజనాల సత్యారావు, పండూరి మురళీ పాల్గొన్నారు.

## 'ఇండోర్ స్టేడియం అభివృద్ధి చేయాలి'

భీమునిపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కుమ్మరిపాలెంలో వున్న ఇండోర్ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని నీడీ వెల్ఫేర్ సభ్యులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కోరారు. బుధవారం వారు ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఎన్‌డబ్ల్యూ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేడియంలో క్రీడాకారులకు సౌకర్యంగా ఉండేలా ఉడెన్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 40 మంది క్రీడాకారులు షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్నారని, ఈ ఏడాది జాతీయ స్థాయి పోటీలకు 8 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి ఇప్పటికే రూ. 2.5 కోట్లు మంజూరయ్యాయని, స్టేడియం నిర్వహణ బాధ్యత భీమిలి ప్రజలు తీసుకుంటే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో నీడీ వెల్ఫేర్ సభ్యులు రాజేటి బసవ కృష్ణమూర్తి, ముసునూరి శ్రీనివాసరావు, కాళ్ల సన్నీ, కోచ్ ఫాల్గుణ, ఎద్దు ప్రకాశ్, బైపిల్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో విఫలం : వైసీపీ



ఆర్డీఓ కార్యాలయం పరిపాలనాధికారిణి మనోరంజనికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమునిపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలు అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) విమర్శించారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పాలన కంటే కక్ష సాధింపు చర్యలే ఎక్కువగా కొనసాగుతున్నాయన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలకు అతిగతీలేదని, ఇచ్చిన హామీలకు తనది బాధ్యత అని ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ తనకు ఉప ముఖ్యమంత్రి, తన అన్నకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో ప్రశ్నించడాన్ని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. పంటలకు గిట్టుబాబు ధర లేక రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ అమలు కావడం లేదని, మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు హామీ తుస్సుమనిపించి మోసం చేశారని పేర్కొన్నారు. అనంతరం భీమిలి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి పరిపాలనాధికారిణి మనోరంజని, తహసీల్దార్ రామారావుకు వినతిపత్రాలు అందించారు. తొలుత పార్టీ శ్రేణులు మినీ స్టేడియం నుంచి పోలీస్‌స్టేషన్, పాతబస్టాండ్, మెయిన్‌రోడ్ మీదుగా ఎగువపేట జంక్షన్ వరకూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండల ఎంపీపీ దంతులూరి వాసురాజు, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, నాయకులు గాడు శ్రీను, బంక సత్యం, మద్దిరాంబాబు, సుంకరి గిరిబాబు, పిన్నింటి వెంకటరమణ, అక్కరమాని రామునాయుడు, ఎస్. కరుణాకర్‌రెడ్డి, మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, మధునాయుడు పాల్గొన్నారు.

# దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ



పసుపు నీళ్లతో స్టేడియాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు

**టీడీపీ యువ నేత గంటా రవితేజ**

భీమునిపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ అని టీడీపీ యువ నేత గంటా రవితేజ విమర్శించారు. పట్టణంలోని మినీ స్టేడియంను టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం సాయంత్రం ట్యాంకర్‌తో పసుపు నీళ్ల తీసుకువచ్చి శుద్ధి చేశారు.ఉదయం వైసీపీ నాయకులు ఈ స్టేడియం నుంచి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి నిరసనగా టీడీపీ శ్రేణులు పసుపు నీళ్లతో స్టేడియంను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వైసీపీ వెన్నుపోటు దినం నిర్వహించడం విడ్డూరంగా వుందన్నారు రాష్ట్ర ప్రజలు రాక్షస పాలనకు చరమగీతం పాడి ఏడాది గడిచిందని, అయినా ఆ పార్టీ నాయకుల్లో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. అనంతరం స్టేడియం నుంచి పాదయాత్రగా చిన్నబజారు జంక్షన్‌కు వెళ్లి అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు,నాయకులు గాడు సన్యాసినాయుడు, కనకల అప్పలనాయుడు, కొప్పల కృష్ణ, పాసి త్రినాథ్ కుమార్, తమ్మిన సూరిబాబు, మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, కొక్కిరి అప్పన్న, అప్పికొండ నూకరాజు, నక్కిళ్ల వెంకటరావు, చోడిపల్లి సాయి, పాల్గొన్నారు.

## జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులకు జాతీయ అవార్డులను అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో వీటిని అందించనున్నట్టు వెల్లడించారు. ఈనెల 15 నుంచి జులై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి పని చేస్తున్న వ్యక్తులు, సంస్థలు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఆర్‌పీఎఫ్ పెట్రోలింగ్‌కు 13 బైక్‌లు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)ను మరింత పటిష్ఠం చేసేందుకు 13 మోటారు సైకిళ్లను సమకూర్చింది. డివిజన్ అంతటా పెట్రోలింగ్ నిర్వహించేందుకుగాను సిబ్బందికి వీటిని సమకూర్చింది. వాల్తేరు డివిజన్ రైల్వే యాజమాన్యం అధికారికంగా ఆర్‌పీఎఫ్‌కు బుధవారం అప్పగించింది. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అలోక్ బొహ్రా పచ్చ జెండా ఊపి వీటిని ప్రారంభించారు. డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్ ప్రకాష్ దుబే తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య శాఖలో బదిలీల జాతర

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులు కదలనున్నారు. ఐదేళ్ల నిబంధనతో చాలామంది బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలో ఐదేళ్లుగా పనిచేస్తున్న సుమారు 59 మంది వైద్యులకు స్థానం చలనం కలగనుంది. వీరిలో సుమారు 15 మంది ప్రొఫెసర్లు, మరో 44 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరంతా ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలోని కేజీహెచ్, విక్టోరియా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధులు, మానసిక, ప్రాంతీయ కంటి ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. ఈ బదిలీల నుంచి తప్పించుకునేందుకు కొందరు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. కూటమి నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఈ బదిలీల నుంచి తమకు మినహాయింపు ఉంటుందని కేజీహెచ్‌లో పని చేసే కొందరు వైద్యులు ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఇదిలావుండగా వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో పనిచేసే సుమారు 250 మంది ఉద్యోగులు తాజా బదిలీల్లో కదలనున్నారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారి వివరాలను అధికారులు కేడర్ల వారీగా ఇప్పటికే వెబ్‌సైట్‌లో పెట్టారు. మొత్తం 37 కేడర్లకు సంబంధించిన ఉద్యోగులు బదిలీ అవుతారని ఆర్డీ రాధారాణి వెల్లడించారు. వీరిలో స్టాఫ్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, హెడ్ నర్సులు, పీహెచ్‌ఎన్, ఫార్మసిస్టులు ఉన్నారు. అలాగే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో సుమారు వంద మందికి పైగా ఉద్యోగులు కదిలే అవకాశం ఉందని చెబు తున్నారు. వీరికి సంబంధించిన జాబితాను కూడా కేడర్ల వారీగా సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు.

# నగరం కాలుష్యమయం

... 5వ పేజీ తరువాయి

నుంచి యార్డులకు బొగ్గు దిగుమతి సమయంలో ధూళి ఎక్కువగా వ్యాపిస్తోంది. తిరిగి యార్డుల్లో రైళ్లు, లారీలకు లోడింగ్ చేసేటప్పుడు కూడా నల్లని ధూళి నగరంపైకి వస్తోంది. యార్డులపై టార్పాలిన్లు కప్పుతున్నా గాలికి టార్పాలిన్లు ఎగిరినప్పుడు, టార్పాలిన్లు కప్పని యార్డుల నుంచి ధూళి గాలిలో కలుస్తోంది. నిరంతరం నీటిని స్ప్రే చేస్తున్నామని చెబుతున్నా ధూళి మాత్రం తగ్గడం లేదు. పోర్టు యాజమాన్యం ఇటీవల జ్ఞానాపురం ఫ్లైఓవర్‌కు ఆనుకుని ఖాళీ ప్రదేశాలలో స్టాకు పాయింట్లు ఏర్పాటుచేసింది. పోర్టుతో పాటు ఆ ప్రాంతంలో గల ఎస్సార్ స్టీల్స్, రెయిన్‌కాల్సింగ్, ఇతర పరిశ్రమల నుంచి పెద్దఎత్తున వస్తున్న కాలుష్యం నగరవాసులను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది.

### అదుపుతప్పిన వాహన, భవన నిర్మాణాల కాలుష్యం

నగరంలో అన్నిరకాల వాహనాలు కలిపి పది లక్షలకు మించి ఉన్నాయి. వీటిలో కాలం చెల్లిన వాహనాల నుంచి విపరీతమైన పొగ వెలువడుతోంది. పోర్టు, ఇతర పరిశ్రమలకు సరుకు రవాణా కోసం వచ్చిపోయే వాహనాల నుంచి కాలుష్యం పరిమితికి మించి నమోదవుతుంది. అదేవిధంగా నగరంలో పాత భవనాలు కూల్చే సమయంలో ధూళి ఎక్కువగా వస్తోంది. నగరంలో ప్రతి రోజు వచ్చే మురుగునీటిని శుద్ధి చేయకుండాసముద్రంలో కలిపేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

### ప్లాస్టిక్ రహిత నగరం సాధ్యం కాదు

నగరంలో మురుగుకాల్వలు, గెడ్డలు, చివరకు సముద్రతీరం పూర్తిగా ప్లాస్టిక్‌తో నిండిపోతున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే గెడ్డల్లో ప్లాస్టిక్ చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. పీఎం 10, పీఎం 2.5 సగటుకు మించి నమోదు

గాలిలో ధూళి కాలుష్యాన్ని పరిమాణం బట్టి పీఎం-10, పీఎం- 2.5గా కొలుస్తారు. శ్వాస పీల్చుకునే సమయంలో ముక్కు రంధ్రం వద్ద ఉండిపోయినవి పీఎం 10 (సూక్ష్మమైనది) కాగా, గాలి పీల్చుకునేటప్పుడు ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయేవి పీఎం 2.5 (అత్యంత సూక్ష్మంగా ఉంటుంది). పీఎం 10 అయితే 24 గంటల సగటు 100, ఏడాది సగటు 60, పీఎం 2.5 అయితే 24 గంటల సగటు 60, ఏడాది సగటు 40 (మిల్లీగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటరు) నమోదుకావాలి. కానీ నగరంలో ఏడాదిలో సగం రోజులు సగటుకు మించి నమోదవుతున్నాయి.

### అరికట్టేందుకు చర్యలు

నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.పోర్టు నుంచి ధూళి వెలువడకుండా బొగ్గు నిల్వకు షెడ్ల నిర్మాణం జరుగుతుంది. ఇప్పటివరకూ 15శాతం షెడ్ల నిర్మాణం పూర్తికాగా ఈ ఏడాది చివరికల్లా మరో 15 శాతం అందుబాటులోకి వస్తాయి. వచ్చే రెండేళ్లలో పూర్తిగా షెడ్లలోనే బొగ్గు నిల్వ చేసేలా పోర్టు కార్యాచరణ ఖరారు చేసింది. ఇక నగరంలో రోడ్లు విస్తరించడం, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం ద్వారా వాహన కాలుష్యం తగ్గుతుంది. ప్రస్తుతం కాలుష్యంలో ఎవరి వాటా ఎంత? అనే అంశంపై ఏయూ పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన అధ్యయనం త్వరలో పూర్తికానున్నది. దాని ఆధారంగా కాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నాం.

**పి.ముకుందరావు,**
**ఈఈ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి**

## ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె విరమణ

... 5వ పేజీ తరువాయి

లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సమ్మెను అన్ని విధాలుగా నిర్వీర్యం చేయడానికి యాజమాన్యం ప్రయత్నించిందని, సహకారం, మద్దతు ప్రకటించిన నాయకులపై కేసులు పెట్టి, బెదిరించిందని ఆరోపించారు. సమ్మె సమయంలోనే 1,541 మందిని విధుల్లోకి రాకుండా ఆపేసిందన్నారు. వారి స్థానంలో కొత్తవారిని తీసుకొని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ విశాఖపట్నం వచ్చే పార్లమెంటరీ కమిటీ దృష్టికి తీసుకువెళ్లి, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకునే విధంగా, హక్కులు పరిరక్షించుకునే విధంగా కృషి చేస్తామని, పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నుంచి పి.నగేశ్, సత్యారావు, ఉమ్మిడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కొరతతో సచివాలయాలు సతమతం

- సంక్షేమ పథకాల దరఖాస్తుకు లబ్ధిదారుల పాట్లు
- ఏడాది నుంచి మూలకు చేరిన కంప్యూటర్లు
- రెండు సచివాలయాలకు ఒకటే సిస్టమ్
- వేధిస్తోన్న స్టేషనరీ సామగ్రి కొరత


మూలకు చేరిన కంప్యూటర్లు


దరఖాస్తు చేసుకునేందుకు వేచి ఉన్న లబ్ధిదారులు



16వ వార్డులో ఒకే చోట ఉన్న నిర్వహిస్తున్న నం. 108, నం.109 సచివాలయాలు

వెంకోజీపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాలు ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా బాలారిష్టాలు మాత్రం వదలడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ వ్యవస్థ నిర్వహణలో పలు లోపాలు ఉన్నాయన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వచ్చాక కొంత ప్రక్షాళన చేశారు. ఇది మంచి పరిణామమే అయినప్పటికీ సచివాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పింఛన్ల పంపిణీ నుంచి సామాజిక సర్వే వరకూ అన్ని రకాల పనులను అప్పగించి సచివాలయం వివిధ విభాగాల కార్యదర్శులను కార్యాలయం నుంచి బయటకు కదల్చారు. ఇంత వరకు బాగానే ఉంది. వారు విధులు నిర్వర్తించడానికి కావాల్సిన కనీస సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తే లబ్ధిదారులకు అందివ్వాల్సిన సంక్షేమ పథకాలను వారికి సక్రమంగా అందే విధంగా ఉద్యోగులు విధులను నిర్వర్తిస్తారని పలువురు అంటున్నారు.

జీవీఎంసీ 16వ వార్డులో ఉన్న సచివాలయాలు నం. 108, నం.109లకు సంబంధించిన సచివాలయాల్లో కనీస సౌకర్యాలు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, స్టేషనరీ సామగ్రి, సరిపడే స్థలం కూడా లేక సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు ఏడాది నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంతో సచివాలయానికి వచ్చే ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ ఇక్కడి 108 సచివాలయంలో ఏర్పాటు చేయడంతో 108 సచివాలయం నిర్వహణ కాస్త పక్కనున్న 109 సచివాలయంలో కలిపేశారు. దీంతో రెండు సచివాలయాలను ఒకే చోట నిర్వహిస్తున్నారు.

అయితే రెండు సచివాలయాల నిర్వహణకు తగిన స్థలం లేకపోవడం, రెండింటికి కలిపి ఒక్కటే కంప్యూటర్‌తో పని చేయడం, అది కూడా ప్రింటర్ గాని, స్కానర్‌గాని లేకపోవడంతో ఏదైనా సంక్షేమ పథకాలకు (కుల, నివాస, ఆదాయ, రేషన్ కార్డు తదితరాలు) దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే లబ్ధిదారులకు సచివాలయం సిబ్బంది సక్రమంగా సేవలను అందించలేని పరిస్థితి నెలకొంది. దీనివల్ల నానా అవస్థలు పడటమే కాకుండా, వచ్చిన లబ్ధిదారులతో మాట పడాల్సిన దుస్థితి ఎదురవుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ నుఅడగ నగరంలో సుమారు 40 సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సచివాలయానికి వచ్చిన ధరఖాస్తులను జోనల్ కార్యాలయానికి రప్పించి వాటిని పూర్తి చేయిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని, సచివాలయాలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని, తద్వారా తమకు సంక్షేమ పథకాలను సంపూర్తిగా అందించే అవకాశం ఉంటుందని సచివాలయం సిబ్బంది కోరుతున్నారు.


టీటీడీ కూడలి వద్ద ముసుగులు వేసి ఉన్న గోవింద నామాలు

## గోవిందనామాలు.. ప్రారంభోత్సవానికి ఇంకెన్నాళ్లు?

- పనులు పూర్తయి 2 నెలలు కావస్తున్నా ముసుగులకే పరిమితం

ఎంవీపీ కాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలిని గోవింద నామాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అయితే, పనులు పూర్తయి రెండు నెలలు కావొస్తున్నా ప్రారంభించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంవీపీ కాలనీలో పలు కూడళ్లలో స్మార్ట్ సిటీ నిధులతో ఆకర్షణీయమైన సర్కిళ్లు నిర్మిస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటెన్లతో నగర అందాలకు కొత్త సొబగులు దిద్దుతున్నారు. ఈ క్రమంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను కూడా అందంగా తీర్చిదిద్దారు. ఇక్కడ టీటీడీ కూడలిగా పేరొందడంతో ఆ పేరుకు తగ్గట్లే సర్కిల్‌ను భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు.

ఇక్కడ నాలుగు రోడ్ల కూడలి కావడంతో ఇటుగా రాకపోకలు సాగించే వారికి కనిపించేలా సర్కిల్ మధ్యలో భారీ గోవింద నామాలను ఏర్పాటు చేశారు. అయితే వీటిని ఏర్పాటు చేసి, నెలలు గడిచిపోతున్నా, వస్త్రాలతో మూసిన గోవిందనామాలను తెరవడం లేదు. ప్రతి రోజూ ఇదే దారిలో వెళ్లే వారంతా ఇవి ఇంకెప్పుడు దర్శనమిస్తాయని అనుకుంటున్నారు. చిన్నపాటి పనులు తప్ప, దాదాపు నిర్మాణం పూర్తయినట్టే. కానీ చిరు పనులూ చేయడం లేదు. పెట్టిన గోవింద నామాల బొమ్మలను ప్రారంభించడమూ లేదు. ఈ కూడలి నిర్మాణానికి రూ 1.44 కోట్లు మంజూరయ్యాయి. స్మార్ట్ సిటీ నిధులతో సర్కిళ్లను అందంగా తయారు చేస్తున్నారు.

ఇప్పటి వరకూ టీటీడీ కూడలిలో సాధారణ సర్కిల్ ఉండేది. తాజా పనుల్లో సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించడానికి స్టోన్ రోడ్డు నిర్మించారు. ఇటు ఇసుకతోట నుంచి వచ్చేటప్పుడు, అటు బీచ్ రోడ్డు నుంచి వచ్చేటప్పుడు రెండు వైపులా కనిపించేలా శంఖు చక్ర నామాలను ఏర్పాటు చేశారు. ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలు వంటి సామగ్రి సిద్ధంగా ఉంది. వీటిని అమర్చడమే తరువాయి. ఇది పూర్తయితే ఈ కూడలికి కొత్త అందాలు వస్తాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా టీటీడీ కల్యాణమండపంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతుంది. వివాహ వేడుకలు సాధారణం కాగా, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంలో ఇక్కడ శంఖు చక్ర నామాలతో కూడలి తీర్చిదిద్దడం పట్ల ఈ ప్రాంతీయుల్లో ఆనందం వ్యక్తమవుతున్నా, ప్రారంభం జాప్యం అవుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన ఈ కూడలిలో గోవిందనామాలు కనిపించే భాగ్యం కలగజేయాలని పలువురు కోరుతున్నారు.

## ప్రభుత్వం దృష్టికి అతిథి అధ్యాపకుల సమస్యలు

- జిల్లా కలెక్టర్


కలెక్టర్‌హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏయూ అతిథి అధ్యాపకుల బృందం ప్రతినిధులు

వెంకోజీపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అతిథి అధ్యాపకుల సమస్యలు, నెలవారీ జీతాలకు సంబంధించిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ తనను కలిసిన ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. రూల్స్‌కి వ్యతిరేకంగా యూనివర్సిటీలో నియమించబడిన టీచింగ్ సభ్యులను అందరిని కూడా పంపించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధ్యాపకుల బృందం కలెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు.

అలాగే వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్ యూనివర్సిటీలో అమలు జరిగేలా, వర్టికల్ విధానం అమలయ్యేలా చూడాలని సభ్యులు కోరారు. మహిళలకు నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన వారిలో అధ్యాపకుల బృందం డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ కార్తీక్ తదితరులు ఉన్నారు.

## సినిమా గైడ్

- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం** :జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్,
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 19, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 34 దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80,బిద్దచిక్కుడు 44, దోస కాయలు 14, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, కీరదోస 34, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామ కాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 535 |
| విజయనగరం | 539 |
| శ్రీకాకుళం | 539 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 90 |
| లైవ్ ధర | 110 |
| విత్ స్కిన్ | 190 |
| స్కిన్‌లెస్ | 200 |

## ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి
- కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు



మొక్కలు నాటుతున్న కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఎస్.రామకృష్ణారావు

వెంకోజీపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణహితంగా, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా మానవ జీవన విధానం ఉండాలని కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకల్లో భాగంగా బుధవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు హాని రహిత ప్రత్యామ్నాయాలు వస్తున్నాయని, వాటిని వినియోగించడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదని చెప్పారు. వియత్నాంలో అరటి గుజ్జుతో ప్లేట్లు తయారు చేస్తున్నారని, యూరప్‌లో ప్లాస్టిక్ రీ-సైక్లింగ్ చేస్తున్న విధానాలను వివరించారు. ఆహార పదార్థాలను ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ చేయడం, ప్యాకింగ్ చేయడం అనారోగ్యాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీ-సైకిల్ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడిన వారవుతారన్నారు. ఈ విషయంలో పౌరులు సామాజిక బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం సైతం ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే యూనిటను నిర్వహించే వారికి ప్రత్యేక రాయితీలను కల్పిస్తోందని తెలిపారు. ప్రజల వైఖరి, ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. యువతరం మార్పునకు మూలకంగా మారాల్సిన అవసరాన్ని వివరించారు. ప్లాస్టిక్ ఉపయోగించి రోడ్లు నిర్మిస్తున్న విధానాన్ని తెలియజేశారు. ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ వస్తోందని, ఇవి సులభంగా భూమిలో కలిసిపోతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు చట్టాలను వివరించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణానికి ఎదురవుతున్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఆసక్తిదాయకంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణహిత జీవనం సాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. 'సేవ్ ఎన్విరాన్‌మెంట్-బ్యాన్ ప్లాస్టిక్' అంటూ నినదించారు.

కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, అధ్యాపకులు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ అలీ, డాక్టర్ రాము, బీఈడీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు

ఆరిలోవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగు పరచుటకు ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పరిశీలకులు రోజా, విశాఖ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి సోమేశ్వరరావు అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయలకు శిక్షణా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ.. పాఠశాల అకడమిక్ క్యాలెండర్ ప్రకారం శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు ఏ విధంగా విద్యార్థులకు బోధన చేయాలి, వాటిలో మెలుకువలు మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రంథాలయ నిర్వహణ, సహితవిద్యలపై డీఆర్పీలకు విజయవాడ కేఎల్ యూనివర్శిటీలో శిక్షణ పొందిన ఎస్ఆర్పీలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తోటగరువు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం దుర్గాభవానీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బడ్డీల తొలగింపులో అధికారుల వివక్ష

వెంకోజీపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) :హెచ్‌బీ కాలనీ ప్రాంతంలో స్టీల్‌ప్లాంటు స్థలాల విక్రయానికి ఇటీవల సంస్థ ఆన్‌లైన్‌లో ఆక్షన్ కోసం సీల్డు టెండర్లను పిలిచింది. దీనికి సంబంధించి ఆక్షన్‌లో పాల్గొనేందుకు చాలా మంది ముందుకు వచ్చారు. అయితే ఈ స్థలాల ప్రహరీ గోడలకు ఆనుకుని ఉన్న బడ్డీలను తొలగించాలని కొనుగోలుదారులు చేసిన ఫిర్యాదు మేరకు సంస్థ ఇక్కడున్న బడ్డీ యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు హెచ్‌బీ కాలనీ ప్రాంతంలోని బడ్డీలను తీయించి వేసింది. పాత వెంకోజీపాలెం నుంచి దుర్గానగర్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఉన్న బడ్డీల వారికి కూడా తొలగించాలని నోటీసులు జారీ చేశారు. అలాగే హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలోనూ ఉన్న బడ్డీలకు కూడా నోటీసులు ఇవ్వడంతో పాటు రెండు, మూడు బడ్డీలను తొలగించారు. అయితే వీటిని తొలగించడంలో కాస్త హడావుడి చేసేరే తప్ప బడ్డీలను తొలగించే ప్రక్రియ మాత్రం చేపట్టలేదని, ఖాళీగా ఉన్న రెండు, మూడు బడ్డీలను మాత్రమే తొలగించి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంటు వారు బడ్డీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని లేఖలను కూడా ఇచ్చామని ఒక పక్క చెబుతున్నా.., విద్యుత్ శాఖాధికారులు మాత్రం బడ్డీలు జీవీఎంసీకి సంబంధించిన రోడ్డుపై ఉన్నందున వారు తమకు నోటీసులు ఇవ్వాలని, అప్పుడే తాము చర్యలు తీసుకోగలమని చెబుతున్నారు.

ఈ విషయమై జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. తాము పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకుని బడ్డీల తొలగింపునకు వెళ్లాలని, తమకైతే అంత ఖాళీ లేదన్నారు. ఎప్పుడో స్థలాలను కొనుగోలు చేసుకున్న యజమానులు వచ్చినప్పుడు స్టీల్ ప్లాంటు వారే తొలగించుకుంటారు అని ఆయన చెప్పారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఈ మార్గంలో బడ్డీల కారణంగా పాదచారులు నడిచేందుకు తగిన దారి లేకుండా పోయింది. రోడ్డుపై చిన్న పిల్లలతో నడవాలంటే బిక్కుబిక్కు మంటూ ముందుకు సాగే దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి బడ్డీలను తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుకు ఆనుకుని కాలువలపై బడ్డీలను ఏర్పాటు చేయడం వల్ల పారిశుధ్య కార్మికులు శుభ్రం చేసేందుకు కూడా వీలుగాపోయిందని, దీంతో మురుగు నిలిచిపోతోందని వారు వాపోతున్నారు.

కాబట్టి వెంటనే బడ్డీలను తొలగించి, కాలువలను కూడా శుభ్రం చేయించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత


సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురైన చికిత్స కోసం ఆర్థిక సహాయానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కు దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన మొత్తానికి సంబంధించిన పత్రాలను బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం సంబంధిత వ్యక్తులకు అందజేశారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకోజీపాలేనికి చెందిన పెంకి వీరబాబుకు రూ. 35,643, పెదవాల్తేరుకు చెందిన బొకం మంగలక్ష్మి రూ.30,786కు సంబంధించిన మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అప్పన్న, దేముడుబాబు పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'


రాలీగా వెళుతున్న వైసీపీ నాయకులు

మద్దిలపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు కళాభారతి నుంచి బుధవారం వైసీపీ వార్డు నాయకులు వెన్నుపోటు దినం కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లారు. వైసీపీ అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, ఎండీయూ ఆపరేటర్స్ ద్విచక్రవాహనాలపై గురజాడ కళాక్షేత్రం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నుంచి నగర అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా పీతల గోవింద్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అలవి కాని హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**ఆరిలోవలో...**

ఆరిలోవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డుకు చెందిన వైసీపీ నేత సత్యాల వెంకటసాగరికి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద వెన్ను పోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం ఆటోలు,ద్విచక్రవాహనాలపై నగరంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లారు.



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైసీపీ 13వ వార్డు నాయకులు

## మంచి కథలతో యువదర్శకులు సినిమాలు తీయాలి

- విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో రూపొందిస్తున్న ప్రొడక్షన్ నంబర్-3 సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్

మద్దిలపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మంచి కథలతో యువదర్శకులు సినిమాలు తీసి విజయం సాధించాలని సినీ నిర్మాత, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శివాజీపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో రూపొందిస్తున్న ప్రొడక్షన్ నంబర్-3 సినిమా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం సినిమా రంగంలో వచ్చిన అధునాతన సాంకేతికతను ఉపయోగించి నూతన దర్శకులు మంచి విజయాలు అందుకుంటున్నారన్నారు. విశాఖ కళాకారులకు పుట్టినిల్లు అన్నారు. ఇక్కడ నుంచే అనేక మంది కళాకారులు సినీ రంగంలో పేరు ప్రఖ్యాతులు పొందారన్నారు. నగరానికి చెందిన దర్శకుడు రత్నం రామ్‌గోపాల్.. ప్రొడక్షన్ నంబర్-3 సినిమా తీయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రత్నం రామ్‌గోపాల్, ఆర్కె మీడియా హౌస్ అధినేత రవికాంత్, సహాయ దర్శకులు నాని, రిషి పాల్గొన్నారు.

## మంత్రి అనిత బాధ్యతను విస్మరించారు

- ఏపీ మానవ హక్కుల ఫోరమ్

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెనాలిలో ముగ్గురు దళిత యువకులను పోలీసులు బహిరంగంగా దండించడాన్ని తప్పుబట్టాల్సిన హోమ్ శాఖ మంత్రి అనిత ఆ బాధ్యతను విస్మరించి, పోలీసులకు మద్దతుగా మాట్లాడటం తగదని మానవ హక్కుల ఫోరం బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించింది. తెనాలి పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంది. తప్పు చేసిన వారికి కులం, మతం ఉండవని మంత్రి పేర్కొన్నారని, దీని ద్వారా ఆమె కుల గుర్తింపును తోసి పుచ్చినట్టయిందని ఫోరమ్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి వెంటనే అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# శభాష్.. సన్యాసిరావు





విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ హోంగార్డులోని మానవీయకోణంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి. హోంగార్డు సన్యాసిరావు బుధవారం ఉదయం సత్యంకూడలిలో ట్రాఫిక్ విధులు నిర్వర్తిసున్నారు. అదే సమయంలో ఒక అంధుడు రోడ్డు దాటేందుకు సత్యం జంక్షన్‌లో వేచి ఉన్నారు. వాహనాల రద్దీ కారణంగా ఎలా రోడ్డు దాటాలో దిక్కుతోచని స్థితిలో నిలబడిపోయారు. ఆ సమయంలో సన్యాసిరావు అతడి దగ్గరకు వెళ్లి చేయిపట్టుకుని రోడ్డు దాటించారు. కొంతసేపటి తర్వాత మండుటెండలో ఒక రిక్షాతో ఐరన్‌రాడ్లను ఒక వ్యక్తి తీసుకెళుతున్నారు. చుర్రుమనిపించే ఎండలో చెమటోడ్చుతూ రిక్షా లాగడానికి ప్రయాస పడుతుండడంతో సన్యాసిరావు వెళ్లి రిక్షాను ముందుకు నెడుతూ రిక్షావాలాకు సహకరించారు. ఆ సమయంలో ట్రాఫిక్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్న వాహనచోదకులు సన్యాసిరావులోని మానవతాగుణాన్ని ప్రశంసించారు.

\- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

## 28 నుంచి శ్రీలంక రామాయణ యాత్ర

అక్కయ్యపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జులై 3 వరకూ శాంకరీ దేవి శక్తి పీఠంతో శ్రీలంక రామాయణ యాత్ర నిర్వహించనున్నట్లు ఆ సంస్థ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంగమిత్ర తెలిపారు. అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొలంబో, మునీశ్వరం దేవాలయం, దంబుల్లా గుహ, లక్ష్మీనారాయణ పెరుమాళ్ ఆలయం, భక్త హనుమాన్ దేవాలయం, సీత అమ్మన్ ఆలయం, అశోక వాటిక, శక్తి పీఠం ప్రయాణం ఉంటుందన్నారు. అలాగే కేరళకు సెప్టెంబరు 12 నుంచి 18 వరకు, గుజరాత్ యాత్ర ఆగస్టు 14 నుంచి 23 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణ ఛార్జీలు, ఇతర ఖర్చులతో కలిసి రుసుములను వివరించారు.

## రైతుబజార్‌లో తనిఖీలు



వివరాలు తెలియజేస్తున్న ఎస్టేట్ అధికారి

సీతమ్మధార, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో గల రైతు బజార్‌లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌లు శోభారాణి, అప్పారావులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లో స్టాల్స్‌లో అమ్ముతున్న సరకులు, రికార్డులను పరిశీలించారు. కొనుగోలుదారులకు నాణ్యమైన కూరగాయలు అమ్మాలని సూచించారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి రికార్డుల్లో నమోదైన సమాచారాన్ని వారికి వివరించారు.

# ఘనంగా కూటమి ఏడాది పాలన సంబరం



జగదాంబ కూడలిలో కేకు కోస్తున్న దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్



తాటిచెట్లపాలెంలో సంబరాలు చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం జగదాంబ జంక్షన్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో 'సుపరిపాలనకు ఏడాది' పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల నేతృత్వంలో ఉచిత బస్సు, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు అమలు కానున్నట్టు తెలి పారు. నియోజకవర్గంలో గతంలో ఉన్న రోడ్లకు ప్రస్తుత రోడ్లకు మధ్య ఉన్న తేడాను ప్రజలు పరిశీలించాలన్నారు.

### జగన్ విధ్వంస పాలన నుంచి విముక్తి

జగన్ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని రక్షించుకుని ఏడాది పూర్తవడం ఆనందంగా ఉందని ప్రజలు భావిస్తున్నారని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద 'రాక్షస పాలనపోయి మళ్లీ రామరాజ్యం వచ్చిన రోజు' కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్‌ల ద్వారా పేదలందరి కడుపు నింపుతోందన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు అనుకూలమైన పథకాలను ఆమె వివరించారు. అందుకే విశాఖలో తెలుగు మహిళలు టపాసులు పేల్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి చూడలేక జగన్‌రెడ్డి కడుపు మంటతో నిరసనలు చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గనగల సత్యవతి, కేదారి లక్ష్మి, రామలక్ష్మి, బి.రమాదేవి, బబేలు, పద్మ, వెంకటలక్ష్మి, సౌజన్య, నూరి, బాగలక్ష్మి, సాయి, రమాదేవి, అనంతకుమారి, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

### రాష్ట్రానికి పీడ విరగడై ఏడాది పూర్తి

అక్కయ్యపాలెం: రాష్ట్రానికి పట్టిన పీడ విరగడై ఏడాది పూర్తయిందని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. పార్టీ నాయకుడు గొంప సాయి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులో దీపాలు వెలిగించి, కేకు కోసి సంబరాలు జరుపుకొన్నారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రాబోయే రోజుల్లో ఏపీ ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. అనంతరం బాణసంచా కాల్చారు. 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, నాయకులు సంకు వేంకటేశ్వరరావు, నీరుకొండ దివాకర్, త్రినాథ్, శ్రవణ్, భాస్కర్, గొరపల్లి శివ, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

సీతమ్మధార: పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ పేదల కోసం పాటుపడుతున్న తీరు అందరికీ అర్థమవుతోందన్నారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ పాఠశాలలో పార్టీ వార్డు ఇంచార్జ్‌లు అడబాల నాని, నాగమణి కృష్ణ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. రంగుల ముగ్గులు వేసిన మహిళలకు ఉషారాణి బహుమతులు అందచేశారు. 27వ వార్డులో జనసేన పార్టీ అధ్యక్షుడు గుండు సురేష్ బాబు చంటి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

### ఉత్తర నియోజకవర్గంలో...



మాధవధారలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మాధవధార: ఉత్తర నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. గ్రేటర్ 50వ వార్డులో చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ పాలాభిషేకం చేశారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆర్పీలు, మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జగన్ పాలన నుంచి విముక్తి లభించిన జూన్ 4వ తేదీన అభివృద్ధికి కొత్త బాటలు పడ్డాయన్నారు. నాయకులు రాము, రామచంద్ర, రామరాజ్యం, సాయమ్మ, అంజలి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య శాఖలో బదిలీల జాతర

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులు కదలనున్నారు. ఐదేళ్ల నిబంధనతో చాలామంది బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలో ఐదేళ్లుగా పనిచేస్తున్న సుమారు 59 మంది వైద్యులకు స్థానం చలనం కలగనుంది. వీరిలో సుమారు 15 మంది ప్రొఫెసర్లు, మరో 44 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరంతా ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలోని కేజీహెచ్, విక్టోరియా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధులు, మానసిక, ప్రాంతీయ కంటి ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. ఈ బదిలీల నుంచి తప్పించుకునేందుకు కొందరు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. కూటమి నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఈ బదిలీల నుంచి తమకు మినహాయింపు ఉంటుందని కేజీహెచ్‌లో పనిచేసే కొందరు వైద్యులు ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఇదిలావుండగా వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో పనిచేసే సుమారు 250 మంది ఉద్యోగులు తాజా బదిలీల్లో కదలనున్నారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారి వివరాలను అధికారులు కేడర్ల వారీగా ఇప్పటికే వెబ్‌సైట్‌లో పెట్టారు. మొత్తం 37 కేడర్లకు సంబంధించిన ఉద్యోగులు బదిలీ అవుతారని ఆర్డీ రాధారాణి వెల్లడించారు. వీరిలో స్టాఫ్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, హెడ్ నర్సులు, పీహెచ్ఎన్, ఫార్మసిస్టులు వంటి కేడర్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. అలాగే, జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సుమారు వంద మందికిపైగా ఉద్యోగులు కదిలే అవకాశం ఉందని చెబుతున్నారు. వీరికి సంబంధించిన జాబితాను కూడా కేడర్ల వారీగా సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు.

# అప్పన్నకు వైభవంగా గరుడసేవ



గరుడ వాహనంపై స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గరుడ సేవ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాల పూజలు చేశారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు. స్వామివా రికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

### పైడితల్లమ్మ వార్షిక పండగ ప్రారంభం

వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి,అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ వార్షిక పండగ బుధవారం సాయంత్రం జోగి తిరువీధితో ప్రారంభమైంది. ఆలయ పూ జారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గరగ పట్టుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరిగారు.

# జోన్‌ల పునర్విభజన

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఇటీవల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎమ్మెల్యేల విజ్ఞప్తికి అనుగుణంగా జోన్‌ల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. జీవీఎంసీలో ఒక అదనపు కమిషనర్‌తోపాటు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కలిసి జోన్‌ల పునర్విభజనపై కసరత్తు ప్రారంభించారు. ఈనెల ఆరున జరిగే కౌన్సిల్ సమావేశంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనను టేబుల్ అజెండాగా చేర్చి చర్చించనున్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత తదుపరి చర్యలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

ఇదిలావుంటే జీవీఎంసీ పరిధిలోని జోన్‌ల పునర్విభజనపై తమకు కనీసం సమాచారం ఇవ్వలేదంటూ కొందరు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పునర్విభజన ఆలోచన మంచిదే అయినప్పటికీ తమ అభిప్రాయాలను తీసుకున్న తర్వాత ప్రతిపాదనను కౌన్సిల్‌లో చర్చించేందుకు అజెండాలో చేర్చాలనే విషయాన్ని అధికారులు విస్మరించారంటూ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

# చీకటి పడితే ఆ మార్గంలో అంధకారమే!



మాధవధార రవాణా కార్యాలయం రహదారిలో వాహనాల వెలుగు ఆధారంగా ప్రయాణాలు

మాధవధార, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలోని అనేక నివాసిత ప్రాంతాలు చిమ్మచీకటిలో మగ్గుతున్నాయి. ప్రధాన రహదారులు మొదలు, వీధి రోడ్లు, పబ్లిక్ పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు అంధకారంలో ఉంటున్నా అధికారులకు పట్టడం లేదు. 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ రోడ్లు చీకటి పడగానే చిమ్మచీకట్లోకి జారుకుంటున్నాయి. అసలే నిర్మానుష్యంగా ఉండే ఇక్కడి ప్రాంతాల్లో కనీస వెలుగులు కరువై, నివాసితులు గమ్యస్థానాల్ని చేరడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వెలుగుల్లోనే అతికష్టంగా రాకపోకలు సాగిస్తున్నారు. 48ఎ బస్ రూట్ ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి. 49వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ, బర్మాక్యాంప్ ప్రాంతాల్లో దారులు వెలుగులు లేక రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 50వ వార్డు మురళీనగర్ నివాసిత సెక్టార్లు చీకటి పడితే రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. పబ్లిక్ పార్కుల్లోనూ ఇదే గతి. ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్ పరిసరాల్లో వీధి దీపాల వెలుగులు లేక ఆకతాయిలకు అడ్డాగా మారాయి. జోన్-5 జీవీఎంసీ వీధి దీపాల నిర్వహణ విభాగం అధికారులు స్పందించి వెలుగులు కల్పించాలని ఈ ప్రాంతాల నివాసితులు కోరుతున్నారు.

# సర్వీస్ రోడ్డు ఆక్రమణ

( 5వ పేజీ తరువాయి)

పెట్టేశారు. మరోవైపు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల సర్వీస్ రోడ్డులో కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లే అవకాశం ఉండడం లేదు. దీంతో వాహనాలన్నీ జాతీయరహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. పాత వెంకోజీపాలెం వద్ద మలుపులో వాహనాలు అదుపుతప్పడం, అదేసమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ముందువెళ్లే వాహనాలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వారం రోజుల్లోనే రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీస్ అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై ఆక్రమణలను పూర్తిగా తొలగించడంతోపాటు పక్కనే ఉన్న దుకాణాలు రోడ్డుపైకి రాకుండా గ్రిల్స్‌ను ఏర్పాటుచేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. అలా చేస్తే జాతీయ రహదారిపై వాహనాల రద్దీ తగ్గుతుందని పేర్కొంటున్నారు.

# ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె విరమణ

(5వ పేజీ తరువాయి)

లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ సమ్మెను అన్ని విధాలుగా నిర్వీర్యం చేయడానికి యాజమాన్యం ప్రయత్నించిందని, సహకారం, మద్దతు ప్రకటించిన నాయకులపై కేసులు పెట్టి, బెదిరించిందని ఆరోపించారు. సమ్మె సమయంలోనే 1,541 మందిని విధుల్లోకి రాకుండా ఆపేసిందన్నారు. వారి స్థానంలో కొత్తవారిని తీసుకొని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ విశాఖపట్నం వచ్చే పార్లమెంటరీ కమిటీ దృష్టికి తీసుకువెళ్లి, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకునే విధంగా, హక్కులు పరిరక్షించుకునే విధంగా కృషిచేస్తామని, ఇతర రూపాల్లో పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నుంచి పి.నగేశ్, సత్యారావు, ఉమ్మిడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ వాసికి మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్



టైటిల్‌తో డాక్టర్ తిరుమలినీ దాసరి

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్‌ను డాబాగార్డెన్స్‌కు చెందిన డాక్టర్ తిరుమలినీ దాసరి కైవసం చేసుకున్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో 1995లో చదివిన ఆమె ఈనెల 1న అమెరికాలో జరిగిన మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలో 200 మందికిపైగా తెలుగు మహిళలు పాల్గొనగా, నిర్వాహకులు 41 మంది ఫైనలిస్టులను ఎంపిక చేశారు. గ్రాండ్ ఫినాలేలో డాక్టర్ తిరుమలినీ దాసరి మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్ గెలుపొందారు.

## 8న విద్యా హక్కు అమలుపై రౌండ్ టేబుల్ సమావేశం

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యా హక్కు చట్టం అమలు తీరుపై ఈనెల 8న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు కన్వీనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. రైటు టు ఎడ్యుకేషన్ ఫోరం, బాల వికాస ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎల్‌బీ కాలేజీ గాంధీ సెంటర్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

## 41వ వార్డులో వైసీపీ 'వెన్నుపోటు దినం'



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

జ్ఞానాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని 41వ వార్డు జ్ఞానాపురంలో వైసీపీ నాయకులు బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి కొడిగుడ్ల శ్రీధర్, కార్పొరేటర్ కొడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా..ఇప్పటివరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు వెలంగణిరావు, కుమార్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సెవెన్ హిల్స్‌లో తొలిసారిగా సిరామిక్ ఇంప్లాంట్‌తో మోకాలి శస్త్ర చికిత్స

మహారాణిపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తొలిసారిగా ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో సిరామిక్ ఇంప్లాంట్‌తో మోకాలు జాయింట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సా నిపుణుడు డా. సుశాంత్ కుమార్ మల్లిక్ తెలిపారు, బుధవారం ఆయన రామ్‌నగర్‌లోని ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒడిశాకు చెందిన వ్యక్తి కుడి మోకాలికి తొలిసారిగా సిరామిక్ ఇంప్లాంట్‌తో శస్త్ర చికిత్స నిర్వహించినట్టు చెప్పారు. అలాగే 49 ఏళ్ల సికిల్ సెల్ రోగికి రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు.

# ఎస్పీ బాలు సేవలు చిరస్మరణీయం



మురళీనగర్‌లో ఎస్పీ బాలు విగ్రహం వద్ద సేవా సంస్థ సభ్యులు

మురళీనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు చలన చిత్ర సీమ సహా భారతీయ భాషల్లో పలు చిత్రాల్లో పాటలు పాడిన గాయకుడు పద్మవిభూషణ్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకల్ని మెలోడీ క్రియేటర్స్, రైల్వే కాలనీ కేర్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎం.మస్తాన్ రెడ్డి, పణి స్వామి, వి.నాంచారయ్య, ఎం.వి.రాజశేఖర్ తదితరులు ఎస్పీ బాలు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ తెలుగు గడ్డపై పుట్టి జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన కళాకారుడు ఎస్పీ బాలు అని కొనియాడారు. ఈనెల 7న మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో 'కళాంజలి సరిగమప' సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి ఎంవీ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ వివరాలతో కూడిన పోస్టర్‌ను బాలు స్మారక విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కళాభిమానులు, ఎస్పీ బాలు అభిమానులు ఈ నెల 7న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

**అక్కయ్యపాలెం** : విశాఖ బాల సుబ్రహ్మణ్యం అభిమాన సంఘం ఆధ్వర్యంలో గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి దొండపర్తిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ విగ్రహాన్ని బీచ్ రోడ్డులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సభ్యులకు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అద్దంకి శ్రీనివాస్, రవికాంత్, జీవీ రమణ, మురళీ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ను ప్రారంభిస్తున్న అలోక్ బొహ్రా

## ఆర్‌పీఎఫ్ పెట్రోలింగ్‌కు 13 నూతన బైక్‌లు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)ను మరింత పటిష్ఠం చేసేందుకు 13 మోటారు సైకిళ్లను సమకూర్చింది. డివిజన్ అంతటా పెట్రోలింగ్ నిర్వహించేందుకుగాను సిబ్బందికి వీటిని సమకూర్చింది. వాల్తేరు డివిజన్ రైల్వే యాజమాన్యం అధికారికంగా ఆర్‌పీఎఫ్‌కు బుధవారం అప్పగించింది.సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అలోక్ బొహ్రా పచ్చ జెండా ఊపి వీటిని ప్రారంభించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్ ప్రకాష్ దుబే తదితరులు పాల్గొన్నారు.

## 'యువ దర్శకులు రాణించాలి '

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : యువ దర్శకులు సినిమా రంగంలో నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న రాణించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో ఆర్కే మీడియా హౌస్ సహ సమర్పణలో వైజాగ్‌కు చెందిన యువ దర్శకుడు రత్నం రామ్‌గోపాల్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రొడక్షన్ నెం 3 చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైజాగ్ కళాకారులకు పుట్టినిల్లు,ఇక్కడ నుంచి ఎంతోమంది దర్శకులు, సాంకేతిక నిపుణులు, రచయితలు సినిమా రంగంలో పేరుప్రఖ్యాతలు తెచ్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కే మీడియా అధినేత రవికాంత్, సీనియర్ జర్నలిస్ట్ బాలకృష్ణ, కవి, రచయిత సత్తివాడ శ్రీకాంత్, నాని, రిషి పాల్గొన్నారు.

## జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులకు జాతీయ అవార్డులను అందించేందుకు వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు జె. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో వీటిని అందించనున్నట్టు వెల్లడించారు. ఈనెల 15 నుంచి జులై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి పని చేస్తున్న వ్యక్తులు, సంస్థలు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అప్లికేషన్లు / నామినేషన్లను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామన్నారు. ఎంపికైన వారికి డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులు ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు.

## ఎన్‌ఎంసీహెచ్ హెచ్‌ఎంగా కొత్తల రాము

సీతమ్మధార, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ జీవీఎంసీ పాఠశాలహెచ్‌ఎంగా కొత్తల రాము బాధ్యత స్వీకరించారు.ఆయన రైల్వే న్యూకాలనీలోని కేవీఎం మహిళ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించి ఇక్కడికి విచ్చేశారు. పాఠశాలలో వసతులు కల్పించి విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

# నగరం కాలుష్యమయం

(5వ పేజీ తరువాయి)

నుంచి యార్డులకు బొగ్గు దిగుమతి సమయంలో ధూళి ఎక్కువగా వ్యాపిస్తోంది. తిరిగి యార్డుల్లో రైళ్లు, లారీలకు లోడింగ్ చేసేటప్పుడు కూడా నల్లని ధూళి నగరంపైకి వస్తోంది. యార్డులపై టార్పాలిన్లు కప్పుతున్నా గాలికి టార్పాలిన్లు ఎగిరినప్పుడు, టార్పాలిన్లు కప్పని యార్డుల నుంచి ధూళి గాలిలో కలుస్తోంది. నిరంతరం నీటిని స్ప్రే చేస్తున్నామని చెబుతున్నా ధూళి మాత్రం తగ్గడం లేదు. పోర్టు యాజమాన్యం ఇటీవల జ్ఞానాపురం ఫ్లైఓవర్‌కు ఆనుకుని ఖాళీ ప్రదేశాలలో స్టాకు పాయింట్లు ఏర్పాటుచేసింది. పోర్టుతో పాటు ఆ ప్రాంతంలో గల ఎస్సార్ స్టీల్స్, రెయిన్‌కాల్సింగ్, ఇతర పరిశ్రమల నుంచి పెద్దఎత్తున వస్తున్న కాలుష్యం నగరవాసులను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది.

### అదుపుతప్పిన వాహన, భవన నిర్మాణాల కాలుష్యం

నగరంలో అన్నిరకాల వాహనాలు కలిపి పది లక్షలకు మించి ఉన్నాయి. వీటిలో కాలంచెల్లిన వాహనాల నుంచి విపరీతమైన పొగ వెలువడుతోంది. పోర్టు, ఇతర పరిశ్రమలకు సరుకు రవాణా కోసం వచ్చిపోయే వాహనాల నుంచి కాలుష్యం పరిమితికి మించి నమోదవుతుంది. అదేవిధంగా నగరంలో పాత భవనాలు కూల్చే సమయంలో ధూళి ఎక్కువగా వస్తోంది. నగరంలో రోజూ వచ్చే మురుగునీటిని శుద్ధి చేయకుండా సముద్రంలో కలిపేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

### ప్లాస్టిక్ రహిత నగరం సాధ్యం కాదు

నగరంలో మురుగుకాల్వలు, గెడ్డలు, చివరకు సముద్రతీరం పూర్తిగా ప్లాస్టిక్‌తో నిండిపోతున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే గెడ్డల్లో ప్లాస్టిక్ చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది.

### పీఎం 10, పీఎం 2.5 సగటుకు మించి నమోదు

గాలిలో ధూళి కాలుష్యాన్ని పరిమాణం బట్టి పీఎం-10, పీఎం- 2.5గా కొలుస్తారు. శ్వాస పీల్చుకునే సమయంలో ముక్కు రంధ్రం వద్ద ఉండిపోయినవి పీఎం 10 (సూక్ష్మమైనది) కాగా, గాలి పీల్చుకునేటప్పుడు ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయేవి పీఎం 2.5 (అత్యంత సూక్ష్మంగా ఉంటుంది). పీఎం 10 అయితే 24 గంటల సగటు 100, ఏడాది సగటు 60, పీఎం 2.5 అయితే 24 గంటల సగటు 60, ఏడాది సగటు 40 (మిల్లీగ్రామ్స్ ఫర్ క్యూబిక్ మీటరు) నమోదు కావాలి. కానీ నగరంలో ఏడాదిలో సగం రోజులు సగటుకు మించి నమోదవుతున్నాయి.

### కాలుష్య తీవ్రత అరికట్టేందుకు చర్యలు

నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. పోర్టు నుంచి ధూళి వెలువడకుండా బొగ్గు నిల్వకు షెడ్ల నిర్మాణం జరుగుతుంది. ఇప్పటివరకూ 15శాతం షెడ్ల నిర్మాణం పూర్తికాగా ఈ ఏడాది చివరికల్లా మరో 15 శాతం అందుబాటులోకి వస్తాయి. వచ్చే రెండేళ్లలో పూర్తిగా షెడ్లలోనే బొగ్గు నిల్వచేసేలా పోర్టు కార్యాచరణ ఖరారు చేసింది. ఇక నగరంలో రోడ్లు విస్తరించడం, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం ద్వారా వాహన కాలుష్యం తగ్గుతుంది. ప్రస్తుతం కాలుష్యంలో ఎవరి వాటా ఎంత? అనే అంశంపై ఏయూ పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన అధ్యయనం త్వరలో పూర్తికానున్నది. దాని ఆధారంగా కాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నాం.

పి.ముకుందరావు, ఈఈ

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి

# మౌలిక సదుపాయాల కొరతతో సచివాలయాలు సతమతం

- సంక్షేమ పథకాల దరఖాస్తుకు లబ్ధిదారుల పాట్లు
- ఏడాది నుంచి మూలకు చేరిన కంప్యూటర్లు
- రెండు సచివాలయాలకు ఒకటే సిస్టమ్
- వేధిస్తోన్న స్టేషనరీ సామగ్రి కొరత


మూలకు చేరిన కంప్యూటర్లు


దరఖాస్తు చేసుకునేందుకు వేచి ఉన్న లబ్ధిదారులు


16వ వార్డులో ఒకే చోట ఉన్న నిర్వహిస్తున్న నం. 108, నం.109 సచివాలయాలు

వెంకోజీపాలెం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాలు ఏర్పాటై ఏళ్ల గడుస్తున్నా బాలారిష్టాలు మాత్రం వదలడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ వ్యవస్థ నిర్వహణలో పలు లోపాలు ఉన్నాయన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వచ్చాక కొంత ప్రక్షాళన చేశారు. ఇది మంచి పరిణామమే అయినప్పటికీ సచివాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పింఛన్ల పంపిణీ నుంచి సామాజిక సర్వే వరకూ అన్ని రకాల పనులను అప్పగించి సచివాలయం వివిధ విభాగాల కార్యదర్శులను కార్యాలయం నుంచి బయటకు కదల్చారు. ఇంత వరకు బాగానే ఉంది. వారు విధులు నిర్వర్తించడానికి కావాల్సిన కనీస సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పిస్తే లబ్ధిదారులకు అందివ్వాల్సిన సంక్షేమ పథకాలను వారికి సక్రమంగా అందే విధంగా ఉద్యోగులు విధులను నిర్వర్తిస్తారని పలువురు అంటున్నారు.

జీవీఎంసీ 16వ వార్డులో ఉన్న సచివాలయాలు నం. 108, నం.109లకు సంబంధించిన సచివాలయాల్లో కనీస సౌకర్యాలు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, స్టేషనరీ సామగ్రి, సరిపడే స్థలం కూడా లేక సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు ఏడాది నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంతో సచివాలయానికి వచ్చే ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ ఇక్కడి 108 సచివాలయంలో ఏర్పాటు చేయడంతో 108 సచివాలయం నిర్వహణ కాస్త పక్కనున్న 109 సచివాలయంలో కలిపేశారు. దీంతో రెండు సచివాలయాలను ఒకే చోట నిర్వహిస్తున్నారు.

అయితే రెండు సచివాలయాల నిర్వహణకు తగిన స్థలం లేకపోవడం, రెండింటికి కలిపి ఒక్కటే కంప్యూటర్‌తో పని చేయడం, అది కూడా ప్రింటర్ గాని, స్కానర్‌గాని లేకపోవడంతో ఏదైనా సంక్షేమ పథకాలకు (కుల, నివాస, ఆదాయ, రేషన్ కార్డు తదితరాలు) ధరఖాస్తు చేసుకునేందుకు వచ్చే లబ్దిదారులకు సచివాలయం సిబ్బంది సక్రమంగా సేవలను అందించలేని పరిస్థితి నెలకొంది. దీనివల్ల నానా అవస్థలు పడటమే కాకుండా, వచ్చిన లబ్ధిదారులతో మాట పడాల్సిన దుస్థితి ఎదురవుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ నుఅడగ నగరంలో సుమారు 40 సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సచివాలయానికి వచ్చిన ధరఖాస్తులను జోనల్ కార్యాలయానికి రప్పించి వాటిని పూర్తి చేయిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని, సచివాలయాలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని, తద్వారా తమకు సంక్షేమ పథకాలను సంపూర్తిగా అందించే అవకాశం ఉంటుందని సచివాలయం సిబ్బంది కోరుతున్నారు.


టీటీడీ కూడలి వద్ద ముసుగులు వేసి ఉన్న గోవింద నామాలు

## గోవిందనామాలు.. ప్రారంభోత్సవానికి ఇంకెన్నాళ్లు?

- పనులు పూర్తయి 2 నెలలు కావస్తున్నా ముసుగులకే పరిమితం

ఎంవీపీ కాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా ఎంవీపీ కాలనీలోని టీటీడి కూడలిని గోవింద నామాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అయితే, పనులు పూర్తయి రెండు నెలలు కావొస్తున్నా ప్రారంభించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంవీపీ కాలనీలో పలు కూడళ్లలో స్మార్ట్ సిటీ నిధులతో ఆకర్షణీయమైన సర్కిళ్లు నిర్మిస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటెన్లతో నగర అందాలకు కొత్త సొబగులు దిద్దుతున్నారు. ఈ క్రమంలో ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను కూడా అందంగా తీర్చిదిద్దారు. ఇక్కడ టీటీడీ కూడలిగా పేరొందడంతో ఆ పేరుకు తగ్గట్లే సర్కిల్‌ను భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు.

ఇక్కడ నాలుగు రోడ్ల కూడలి కావడంతో ఇటుగా రాకపోకలు సాగించే వారికి కనిపించేలా సర్కిల్ మధ్యలో భారీ గోవింద నామాలను ఏర్పాటు చేశారు. అయితే వీటిని ఏర్పాటు చేసి, నెలలు గడిచిపోతున్నా, వస్త్రాలతో మూసిన గోవిందనామాలను తెరవడం లేదు. ప్రతి రోజూ ఇదే దారిలో వెళ్లే వారంతా ఇవి ఇంకెప్పుడు దర్శనమిస్తాయని అనుకుంటున్నారు. చిన్నపాటి పనులు తప్ప, దాదాపు నిర్మాణం పూర్తయినట్టే. కానీ చిరు పనులూ చేయడం లేదు. పెట్టిన గోవింద నామాల బొమ్మలను ప్రారంభించడమూ లేదు. ఈ కూడలి నిర్మాణానికి రూ 1.44 కోట్లు మంజూరయ్యాయి. స్మార్ట్ సిటీ నిధులతో సర్కిళ్లను అందంగా తయారు చేస్తున్నారు.

ఇప్పటి వరకూ టీటీడీ కూడలిలో సాధారణ సర్కిల్ ఉండేది. తాజా పనుల్లో సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించడానికి స్టోన్ రోడ్డు నిర్మించారు. ఇటు ఇసుకతోట నుంచి వచ్చేటప్పుడు, అటు బీచ్ రోడ్డు నుంచి వచ్చేటప్పుడు రెండు వైపులా కనిపించేలా శంఖు చక్ర నామాలను ఏర్పాటు చేశారు. ఫౌంటెన్‌లు, విద్యుత్తు దీపాలు వంటి సామగ్రి సిద్ధంగా ఉంది. వీటిని అమర్చడమే తరువాయి. ఇది పూర్తయితే ఈ కూడలికి కొత్త అందాలు వస్తాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా టీటీడి కల్యాణమండపంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతుంది. వివాహ వేడుకలు సాధారణం కాగా, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంలో ఇక్కడ శంఖు చక్ర నామాలతో కూడలి తీర్చిదిద్దడం పట్ల ఈ ప్రాంతీయుల్లో ఆనందం వ్యక్తమవుతున్నా, ప్రారంభం జాప్యం అవుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన ఈ కూడలిలో గోవిందనామాలు కనిపించే భాగ్యం కలగజేయాలని పలువురు కోరుతున్నారు.

## ప్రభుత్వం దృష్టికి అతిథి అధ్యాపకుల సమస్యలు

- జిల్లా కలెక్టర్


కలెక్టర్‌హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏయూ అతిథి అధ్యాపకుల బృందం ప్రతినిధులు

వెంకోజీపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అతిథి అధ్యాపకుల సమస్యలు, నెలవారీ జీతాలకు సంబంధించిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ తనను కలిసిన ఏయూ అతిథి అధ్యాపకుల సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. రూల్స్‌కి వ్యతిరేకంగా యూనివర్సిటీలో నియమించబడిన టీచింగ్ సభ్యులను అందరిని కూడా పంపించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధ్యాపకుల బృందం కలెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు.

అలాగే వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్ యూనివర్సిటీలో అమలు జరిగేలా, వర్టికల్ విధానం అమలయ్యేలా చూడాలని సభ్యులు కోరారు. మహిళలకు నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన వారిలో అధ్యాపకుల బృందం డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ కార్తీక్ తదితరులు ఉన్నారు.

## ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి
- కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు


మొక్కలు నాటుతున్న కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఎస్.రామకృష్ణారావు

వెంకోజీపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణహితంగా, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా మానవ జీవన విధానం ఉండాలని కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకల్లో భాగంగా బుధవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు హాని రహిత ప్రత్యామ్నాయాలు వస్తున్నాయని, వాటిని వినియోగించడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదని చెప్పారు. వియత్నాంలో అరటి గుజ్జుతో ప్లేట్లు తయారు చేస్తున్నారని, యూరప్‌లో ప్లాస్టిక్ రీ-సైక్లింగ్ చేస్తున్న విధానాలను వివరించారు. ఆహార పదార్థాలను ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వ చేయడం, ప్యాకింగ్ చేయడం అనారోగ్యాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీ-సైకిల్ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడిన వారవుతారన్నారు. ఈ విషయంలో పౌరులు సామాజిక బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం సైతం ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే యూనిటను నిర్వహించే వారికి ప్రత్యేక రాయితీలను కల్పిస్తోందని తెలిపారు. ప్రజల వైఖరి, ఆలోచనల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. యువతరం మార్పునకు మూలకంగా మారాల్సిన అవసరాన్ని వివరించారు. ప్లాస్టిక్ ఉపయోగించి రోడ్లు నిర్మిస్తున్న విధానాన్ని తెలియజేశారు. ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ వస్తోందని, ఇవి సులభంగా భూమిలో కలిసిపోతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు చట్టాలను వివరించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణానికి ఎదురవుతున్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఆసక్తిదాయకంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణహిత జీవనం సాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. 'సేవ్ ఎన్విరాన్‌మెంట్-బ్యాన్ ప్లాస్టిక్' అంటూ నినదించారు.

కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, అధ్యాపకులు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ అలీ, డాక్టర్ రాము, బీఈడీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత


సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురైన చికిత్స కోసం ఆర్థిక సహాయానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కు దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన మొత్తానికి సంబంధించిన పత్రాలను బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం సంబంధిత వ్యక్తులకు అందజేశారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకోజీపాలేనికి చెందిన పెంకి వీరబాబుకు రూ. 35,643, పెదవాల్తేరుకు చెందిన బొకం మంగలక్ష్మి రూ.30,786కు సంబంధించిన మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అప్పన్న, దేముడుబాబు పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'


ర్యాలీగా వెళుతున్న వైసీపీ నాయకులు

మద్దిలపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు కళాభారతి నుంచి బుధవారం వైసీపీ వార్డు నాయకులు వెన్నుపోటు దినం కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లారు. వైసీపీ అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, ఎండీయూ ఆపరేటర్స్ ద్విచక్రవాహనాలపై గురజాడ కళాక్షేత్రం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నుంచి నగర అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా పీతల గోవింద్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అలవి కాని హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**ఆరిలోవలో...**

ఆరిలోవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డుకు చెందిన వైసీపీ నేత సత్యాల వెంకటసాగరికి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద వెన్ను పోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం ఆటోలు,ద్విచక్రవాహనాలపై నగరంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లారు.


వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైసీపీ 13వ వార్డు నాయకులు

## మంచి కథలతో యువదర్శకులు సినిమాలు తీయాలి

- విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో రూపొందిస్తున్న ప్రొడక్షన్ నంబర్-3 సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్

మద్దిలపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మంచి కథలతో యువదర్శకులు సినిమాలు తీసి విజయం సాధించాలని సినీ నిర్మాత, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. శివాజీపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో రూపొందిస్తున్న ప్రొడక్షన్ నంబర్-3 సినిమా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం సినిమా రంగంలో వచ్చిన అధునాతన సాంకేతికతను ఉపయోగించి నూతన దర్శకులు మంచి విజయాలు అందుకుంటున్నారన్నారు. విశాఖ కళాకారులకు పుట్టినిల్లు అన్నారు. ఇక్కడ నుంచే అనేక మంది కళాకారులు సినీ రంగంలో పేరు ప్రఖ్యాతులు పొందారన్నారు. నగరానికి చెందిన దర్శకుడు రత్నం రామ్‌గోపాల్. ప్రొడక్షన్ నంబర్-3 సినిమా తీయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రత్నం రామ్‌గోపాల్, ఆర్కె మీడియా హౌస్ అధినేత రవి కాంత్, సహాయ దర్శకులు నాని, రిషి పాల్గొన్నారు.

## మంత్రి అనిత బాధ్యతను విస్మరించారు

- ఏపీ మానవ హక్కుల ఫోరమ్

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెనాలిలో ముగ్గురు దళిత యువకులను పోలీసులు బహిరంగంగా దండించడాన్ని తప్పుబట్టాల్సిన హోమ్ శాఖ మంత్రి అనిత ఆ బాధ్యతను విస్మరించి, పోలీసులకు మద్దతుగా మాట్లాడటం తగదని మానవ హక్కుల ఫోరం బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించింది. తెనాలి పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంది. తప్పు చేసిన వారికి కులం, మతం ఉండవని మంత్రి పేర్కొన్నారని, దీని ద్వారా ఆమె కుల గుర్తింపును తోసి పుచ్చినట్టయిందని ఫోరమ్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి వెంటనే అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు

ఆరిలోవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగు పరచుటకు ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పరిశీలకులు రోజా, విశాఖ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి సోమేశ్వరరావు అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయలకు శిక్షణా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ.. పాఠశాల అకడమిక్ క్యాలెండర్ ప్రకారం శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు ఏ విధంగా విద్యార్థులకు బోధన చేయాలి, వాటిలో మెలుకువలు మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రంథాలయ నిర్వహణ, సహితవిద్యలపై డీఆర్పీలకు విజయవాడ కేఎల్ యూనివర్శిటీలో శిక్షణ పొందిన ఎస్ఆర్పీలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తోటగరువు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం దుర్గాభవానీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బడ్డీల తొలగింపులో అధికారుల వివక్ష

వెంకోజీపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) :హెచ్‌బీ కాలనీ ప్రాంతంలో స్టీల్‌ప్లాంటు స్థలాల విక్రయానికి ఇటీవల సంస్థ ఆన్‌లైన్‌లో ఆక్షన్ కోసం సీల్డు టెండర్లను పిలిచింది. దీనికి సంబంధించి ఆక్షన్‌లో పాల్గొనేందుకు చాలా మంది ముందుకు వచ్చారు. అయితే ఈ స్థలాల ప్రహరీ గోడలకు ఆనుకుని ఉన్న బడ్డీలను తొలగించాలని కొనుగోలుదారులు చేసిన ఫిర్యాదు మేరకు సంస్థ ఇక్కడున్న బడ్డీ యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు హెచ్‌బీ కాలనీ ప్రాంతంలోని బడ్డీలను తీయించి వేసింది. పాత వెంకోజీపాలెం నుంచి దుర్గానగర్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఉన్న బడ్డీల వారికి కూడా తొలగించాలని నోటీసులు జారీ చేశారు. అలాగే హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలోనూ ఉన్న బడ్డీలకు కూడా నోటీసులు ఇవ్వడంతో పాటు రెండు, మూడు బడ్డీలను తొలగించారు. అయితే వీటిని తొలగించడంలో కాస్త హడావుడి చేసేరే తప్ప బడ్డీలను తొలగించే ప్రక్రియ మాత్రం చేపట్టలేదని, ఖాళీగా ఉన్న రెండు, మూడు బడ్డీలను మాత్రమే తొలగించి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంటు వారు బడ్డీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని లేఖలను కూడా ఇచ్చామని ఒక పక్క చెబుతున్నా.., విద్యుత్ శాఖాధికారులు మాత్రం బడ్డీలు జీవీఎంసీకి సంబంధించిన రోడ్డుపై ఉన్నందున వారు తమకు నోటీసులు ఇవ్వాలని, అప్పుడే తాము చర్యలు తీసుకోగలమని చెబుతున్నారు.

ఈ విషయమై జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. తాము పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకుని బడ్డీల తొలగింపునకు వెళ్లాలని, తమకైతే అంత ఖాళీ లేదన్నారు. ఎప్పుడో స్థలాలను కొనుగోలు చేసుకున్న యజమానులు వచ్చినప్పుడు స్టీల్ ప్లాంటు వారే తొలగించుకుంటారు అని ఆయన చెప్పారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఈ మార్గంలో బడ్డీల కారణంగా పాదచారులు నడిచేందుకు తగిన దారి లేకుండా పోయింది. రోడ్డుపై చిన్న పిల్లలతో నడవాలంటే బిక్కుబిక్కు మంటూ ముందుకు సాగే దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి బడ్డీలను తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుకు ఆనుకుని కాలువలపై బడ్డీలను ఏర్పాటు చేయడం వల్ల పారిశుధ్య కార్మికులు శుభ్రం చేసేందుకు కూడా వీలుగా పోయిందని, దీంతో మురుగు నిలిచిపోతోందని వారు వాపోతున్నారు.

కాబట్టి వెంటనే బడ్డీలను తొలగించి, కాలువలను కూడా శుభ్రం చేయించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సినిమా గైడ్

- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం** :జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్,
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 19, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 34 దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80,బద్దచిక్కుడు 44, దోస కాయలు 14, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, కీరదోస 34, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామ కాయలు (కిలో) 80.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 535 |
| విజయనగరం | 539 |
| శ్రీకాకుళం | 539 |

| చికెన్ ధరలు (బ్యాగ్) | |
|---|---|
| రైతు ధర | 90 |
| లైవ్ ధర | 110 |
| విత్ స్కిన్ | 190 |
| స్కిన్‌లెస్ | 200 |

## శభాష్.. సన్యాసిరావు




విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ హోంగార్డులోని మానవీయకోణంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి. హోంగార్డు సన్యాసిరావు బుధవారం ఉదయం సత్యంకూడలిలో ట్రాఫిక్ విధులు నిర్వర్తిసున్నారు. అదే సమయంలో ఒక అంధుడు రోడ్డు దాటేందుకు సత్యం జంక్షన్‌లో వేచి ఉన్నారు. వాహనాల రద్దీ కారణంగా ఎలా రోడ్డు దాటాలో దిక్కుతోచని స్థితిలో నిలబడిపోయారు. ఆ సమయంలో సన్యాసిరావు అతడి దగ్గరకు వెళ్లి చేయిపట్టుకుని రోడ్డు దాటించారు. కొంతసేపటి తర్వాత మండుటెండలో ఒక రిక్షాతో ఐరన్‌రాడ్లను ఒక వ్యక్తి తీసుకెళుతున్నారు. చుర్రుమనిపించే ఎండలో చెమటోడ్చుతూ రిక్షా లాగడానికి ప్రయాస పడుతుండడంతో సన్యాసిరావు వెళ్లి రిక్షాను ముందుకు నెడుతూ రిక్షావాలాకు సహకరించారు. ఆ సమయంలో ట్రాఫిక్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్న వాహనచోదకులు సన్యాసిరావులోని మానవతాగుణాన్ని ప్రశంసించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

## 28 నుంచి శ్రీలంక రామాయణ యాత్ర

అక్కయ్యపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జులై 3 వరకూ శాంకరీ దేవి శక్తి పీఠంతో శ్రీలంక రామాయణ యాత్ర నిర్వహించనున్నట్టు ఆ సంస్థ టూరిజం ఎగ్జిక్యూటివ్ సంగమిత్ర తెలిపారు. అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొలంబో, మునీశ్వరం దేవాలయం, దంబుల్లా గుహ, లక్ష్మీనారాయణ పెరుమాళ్ ఆలయం, భక్త హనుమాన్ దేవాలయం, సీత అమ్మన్ ఆలయం, అశోక వాటిక, శక్తి పీఠం ప్రయాణం ఉంటుందన్నారు. అలాగే కేరళకు సెప్టెంబరు 12 నుంచి 18 వరకు, గుజరాత్ యాత్ర ఆగస్టు 14 నుంచి 23 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణ ఛార్జీలు, ఇతర ఖర్చులతో కలిసి రుసుములను వివరించారు.

## రైతుబజార్‌లో తనిఖీలు


వివరాలు తెలియజేస్తున్న ఎస్టేట్ అధికారి

సీతమ్మధార, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలో గల రైతు బజార్‌లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌లు శోభారాణి, అప్పారావులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లో స్టాల్స్‌లో అమ్ముతున్న సరకులు, రికార్డులను పరిశీలించారు. కొనుగోలుదారులకు నాణ్యమైన కూరగాయలు అమ్మాలని సూచించారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి రికార్డుల్లో నమోదైన సమాచారాన్ని వారికి వివరించారు.

# ఘనంగా కూటమి ఏడాది పాలన సంబరం


జగదాంబ కూడలిలో కేకు కోస్తున్న దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్


తాటిచెట్లపాలెంలో సంబరాలు చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం జగదాంబ జంక్షన్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో 'సుపరిపాలనకు ఏడాది' పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల నేతృత్వంలో ఉచిత బస్సు, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు అమలు కానున్నట్టు తెలి పారు. నియోజకవర్గంలో గతంలో ఉన్న రోడ్లకు ప్రస్తుత రోడ్లకు మధ్య ఉన్న తేడాను ప్రజలు పరిశీలించాలన్నారు.

### జగన్ విధ్వంస పాలన నుంచి విముక్తి

జగన్ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని రక్షించుకుని ఏడాది పూర్తవడం ఆనందంగా ఉందని ప్రజలు భావిస్తున్నారని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద 'రాక్షస పాలనపోయి మళ్లీ రామరాజ్యం వచ్చిన రోజు' కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్‌ల ద్వారా పేదలందరి కడుపు నింపుతోందన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు అనుకూలమైన పథకాలను ఆమె వివరించారు. అందుకే విశాఖలో తెలుగు మహిళలు టపాసులు పేల్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి చూడలేక జగన్‌రెడ్డి కడుపు మంటతో నిరసనలు చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గనగల సత్యవతి, కేదారి లక్ష్మి, రామలక్ష్మి, బి.రమాదేవి, బబేలు, పద్మ, వెంకటలక్ష్మి, సౌజన్య, నూరి, భాగలక్ష్మి, సాయి, రమాదేవి, అనంతకుమారి, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

### రాష్ట్రానికి పీడ విరగడై ఏడాది పూర్తి

అక్కయ్యపాలెం: రాష్ట్రానికి పట్టిన పీడ విరగడై ఏడాది పూర్తయిందని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. పార్టీ నాయకుడు గొంప సాయి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డులో దీపాలు వెలిగించి, కేకు కోసి సంబరాలు జరుపుకొన్నారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రాబోయే రోజుల్లో ఏపీ ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. అనంతరం బాణసంచా కాల్చారు. 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, నాయకులు సంకు వేంకటేశ్వరరావు, నీరుకొండ దివాకర్, త్రినాథ్, శ్రవణ్, భాస్కర్, గొరపల్లి శివ, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

సీతమ్మధార: పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఉత్తర నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ పేదల కోసం పాటుపడుతున్న తీరు అందరికీ అర్థమవుతోందన్నారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ పాఠశాలలో పార్టీ వార్డు ఇంచార్జ్‌లు అడబాల నాని, నాగమణి కృష్ణ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. రంగుల ముగ్గులు వేసిన మహిళలకు ఉషారాణి బహుమతులు అందచేశారు. 27వ వార్డులో జనసేన పార్టీ అధ్యక్షుడు గుండు సురేష్ బాబు చంటి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

### ఉత్తర నియోజకవర్గంలో...


మాధవధారలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మాధవధార: ఉత్తర నియోజకవర్గంలో టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. గ్రేటర్ 50వ వార్డులో చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ పాలాభిషేకం చేశారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆర్పీలు, మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జగన్ పాలన నుంచి విముక్తి లభించిన జూన్ 4వ తేదీన అభివృద్ధికి కొత్త బాటలు పడ్డాయన్నారు. నాయకులు రాము, రామచంద్ర, రామరాజ్యం, సాయమ్మ, అంజలి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.


మాధవధార రవాణా కార్యాలయం రహదారిలో వాహనాల వెలుగు ఆధారంగా ప్రయాణాలు

# చీకటి పడితే ఆ మార్గంలో అంధకారమే!

మాధవధార, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలోని అనేక నివాసిత ప్రాంతాలు చిమ్మచీకటిలో మగ్గుతున్నాయి. ప్రధాన రహదారులు మొదలు, వీధి రోడ్లు, పబ్లిక్ పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు అంధకారంలో ఉంటున్నా అధికారులకు పట్టడం లేదు. 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ రోడ్లు చీకటి పడగానే చిమ్మచీకట్లోకి జారుకుంటున్నాయి. అసలే నిర్మానుష్యంగా ఉండే ఇక్కడి ప్రాంతాల్లో కనీస వెలుగులు కరువై, నివాసితులు గమ్యస్థానాల్ని చేరడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వెలుగుల్లోనే అతికష్టంగా రాకపోకలు సాగిస్తున్నారు. 48ఎ బస్ రూట్ ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి. 49వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీ, బర్మాక్యాంప్ ప్రాంతాల్లో దారులు వెలుగులు లేక రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 50వ వార్డు మురళీనగర్ నివాసిత సెక్టార్లు చీకటి పడితే రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. పబ్లిక్ పార్కుల్లోనూ ఇదే గతి. ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్ పరిసరాల్లో వీధి దీపాల వెలుగులు లేక ఆకతాయిలకు అడ్డాగా మారాయి. జోన్-5 జీవీఎంసీ వీధి దీపాల నిర్వహణ విభాగం అధికారులు స్పందించి వెలుగులు కల్పించాలని ఈ ప్రాంతాల నివాసితులు కోరుతున్నారు.

# ఆరోగ్య శాఖలో బదిలీల జాతర

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులు కదలనున్నారు. ఐదేళ్ల నిబంధనతో చాలామంది బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలో ఐదేళ్లుగా పనిచేస్తున్న సుమారు 59 మంది వైద్యులకు స్థానం చలనం కలగనుంది. వీరిలో సుమారు 15 మంది ప్రొఫెసర్లు, మరో 44 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరంతా ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలోని కేజీహెచ్, విక్టోరియా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధులు, మానసిక, ప్రాంతీయ కంటి ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. ఈ బదిలీల నుంచి తప్పించుకునేందుకు కొందరు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. కూటమి నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఈ బదిలీల నుంచి తమకు మినహాయింపు ఉంటుందని కేజీహెచ్‌లో పనిచేసే కొందరు వైద్యులు ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఇదిలావుండగా వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో పనిచేసే సుమారు 250 మంది ఉద్యోగులు తాజా బదిలీల్లో కదలనున్నారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారి వివరాలను అధికారులు కేడర్ల వారీగా ఇప్పటికే వెబ్‌సైట్‌లో పెట్టారు. మొత్తం 37 కేడర్లకు సంబంధించిన ఉద్యోగులు బదిలీ అవుతారని ఆర్డీ రాధారాణి వెల్లడించారు. వీరిలో స్టాఫ్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, హెడ్ నర్సులు, పీహెచ్‌ఎన్, ఫార్మసిస్టులు వంటి కేడర్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. అలాగే, జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సుమారు వంద మందికిపైగా ఉద్యోగులు కదిలే అవకాశం ఉందని చెబుతున్నారు. వీరికి సంబంధించిన జాబితాను కూడా కేడర్ల వారీగా సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు.

# అప్పన్నకు వైభవంగా గరుడసేవ


గరుడ వాహనంపై స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గరుడ సేవ బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి రజిత గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాల పూజలు చేశారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు. స్వామివా రికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

### పైడితల్లమ్మ వార్షిక పండగ ప్రారంభం

వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి,అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ వార్షిక పండగ బుధవారం సాయంత్రం జోగి తిరువీధితో ప్రారంభమైంది. ఆలయ పూ జారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గరగ పట్టుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరిగారు.

# జోన్‌ల పునర్విభజన

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఇటీవల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎమ్మెల్యేల విజ్ఞప్తికి అనుగుణంగా జోన్‌ల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. జీవీఎంసీలో ఒక అదనపు కమిషనర్‌తోపాటు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కలిసి జోన్‌ల పునర్విభజనపై కసరత్తు ప్రారంభించారు. ఈనెల ఆరున జరిగే కౌన్సిల్ సమావేశంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనను టేబుల్ అజెండాగా చేర్చి చర్చించనున్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత తదుపరి చర్యలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

ఇదిలావుంటే జీవీఎంసీ పరిధిలోని జోన్‌ల పునర్విభజనపై తమకు కనీసం సమాచారం ఇవ్వలేదంటూ కొందరు కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పునర్విభజన ఆలోచన మంచిదే అయినప్పటికీ తమ అభిప్రాయాలను తీసుకున్న తర్వాత ప్రతిపాదనను కౌన్సిల్‌లో చర్చించేందుకు అజెండాలో చేర్చాలనే విషయాన్ని అధికారులు విస్మరించారంటూ అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

# సర్వీస్ రోడ్డు ఆక్రమణ

( 5వ పేజీ తరువాయి)

పెట్టేశారు. మరోవైపు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల సర్వీస్ రోడ్డులో కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లే అవకాశం ఉండడం లేదు. దీంతో వాహనాలన్నీ జాతీయరహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. పాత వెంకోజీపాలెం వద్ద మలుపులో వాహనాలు అదుపుతప్పడం, అదేసమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ముందువెళ్లే వాహనాలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వారం రోజుల్లోనే రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా జీవీఎంసీ, పోలీస్ అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుపై ఆక్రమణలను పూర్తిగా తొలగించడంతోపాటు పక్కనే ఉన్న దుకాణాలు రోడ్డుపైకి రాకుండా గ్రిల్స్‌ను ఏర్పాటుచేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. అలా చేస్తే జాతీయ రహదారిపై వాహనాల రద్దీ తగ్గుతుందని పేర్కొంటున్నారు.

# ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె విరమణ

(5వ పేజీ తరువాయి)

లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ సమ్మెను అన్ని విధాలుగా నిర్వీర్యం చేయడానికి యాజమాన్యం ప్రయత్నించిందని, సహకారం, మద్దతు ప్రకటించిన నాయకులపై కేసులు పెట్టి, బెదిరించిందని ఆరోపించారు. సమ్మె సమయంలోనే 1,541 మందిని విధుల్లోకి రాకుండా ఆపేసిందన్నారు. వారి స్థానంలో కొత్తవారిని తీసుకొని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ విశాఖపట్నం వచ్చే పార్లమెంటరీ కమిటీ దృష్టికి తీసుకువెళ్లి, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకునే విధంగా, హక్కులు పరిరక్షించుకునే విధంగా కృషిచేస్తామని, ఇతర రూపాల్లో పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నుంచి పి.నగేశ్, సత్యారావు, ఉమ్మిడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ వాసికి మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్


టైటిల్‌తో డాక్టర్ తిరుమలినీ దాసరి

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్‌ను డాబాగార్డెన్స్‌కు చెందిన డాక్టర్ తిరుమలినీ దాసరి కైవసం చేసుకున్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో 1995లో చదివిన ఆమె ఈనెల 1న అమెరికాలో జరిగిన మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలో 200 మందికిపైగా తెలుగు మహిళలు పాల్గొనగా, నిర్వాహకులు 41 మంది ఫైనలిస్టులను ఎంపిక చేశారు. గ్రాండ్ ఫినాలేలో డాక్టర్ తిరుమలినీ దాసరి మిసెస్ తెలుగు యూఎస్‌ఏ టైటిల్ గెలుపొందారు.

## 8న విద్యా హక్కు అమలుపై రౌండ్ టేబుల్ సమావేశం

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యా హక్కు చట్టం అమలు తీరుపై ఈనెల 8న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు కన్వీనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. రైటు టు ఎడ్యుకేషన్ ఫోరం, బాల వికాస ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎల్‌బీ కాలేజీ గాంధీ సెంటర్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

## 41వ వార్డులో వైసీపీ 'వెన్నుపోటు దినం'


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

జ్ఞానాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని 41వ వార్డు జ్ఞానాపురంలో వైసీపీ నాయకులు బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి కొడిగుడ్ల శ్రీధర్, కార్పొరేటర్ కొడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా..ఇప్పటివరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు వెలంగణి రావు, కుమార్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సెవెన్ హిల్స్‌లో తొలిసారిగా సిరామిక్ ఇంప్లాంట్‌తో మోకాలి శస్త్ర చికిత్స

మహారాణిపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తొలిసారిగా ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో సిరామిక్ ఇంప్లాంట్‌తో మోకాలు జాయింట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సా నిపుణుడు డా. సుశాంత్ కుమార్ మల్లిక్ తెలిపారు, బుధవారం ఆయన రామ్‌నగర్‌లోని ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒడిశాకు చెందిన వ్యక్తి కుడి మోకాలికి తొలిసారిగా సిరామిక్ ఇంప్లాంట్‌తో శస్త్ర చికిత్స నిర్వహించినట్టు చెప్పారు. అలాగే 49 ఏళ్ల సికిల్ సెల్ రోగికి రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు.

# ఎస్పీ బాలు సేవలు చిరస్మరణీయం


మురళీనగర్‌లో ఎస్పీ బాలు విగ్రహం వద్ద సేవా సంస్థ సభ్యులు

మురళీనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు చలన చిత్ర సీమ సహా భారతీయ భాషల్లో పలు చిత్రాల్లో పాటలు పాడిన గాయకుడు పద్మవిభూషణ్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకల్ని మెలోడీ క్రియేటర్స్, రైల్వే కాలనీ కేర్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎం.మస్తాన్ రెడ్డి, ఫణి స్వామి, వి.నాంచారయ్య, ఎం.వి.రాజశేఖర్ తదితరులు ఎస్పీ బాలు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ తెలుగు గడ్డపై పుట్టి జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన కళాకారుడు ఎస్పీ బాలు అని కొనియాడారు. ఈనెల 7న మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో 'కళాంజలి సరిగమప' సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి ఎంవీ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ వివరాలతో కూడిన పోస్టర్‌ను బాలు స్మారక విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కళాభిమానులు, ఎస్పీ బాలు అభిమానులు ఈ నెల 7న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

**అక్కయ్యపాలెం** : విశాఖ బాల సుబ్రహ్మణ్యం అభిమాన సంఘం ఆధ్వర్యంలో గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి దొండపర్తిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ విగ్రహాన్ని బీచ్ రోడ్డులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సభ్యులకు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అద్దంకి శ్రీనివాస్, రవికాంత్, జీవీ రమణ, మురళీ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బైక్‌ను ప్రారంభిస్తున్న అలోక్ బొహ్రా

## ఆర్‌పీఎఫ్ పెట్రోలింగ్‌కు 13 నూతన బైక్‌లు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)ను మరింత పటిష్ఠం చేసేందుకు 13 మోటారు సైకిళ్లను సమకూర్చింది. డివిజన్ అంతటా పెట్రోలింగ్ నిర్వహించేందుకుగాను సిబ్బందికి వీటిని సమకూర్చింది. వాల్తేరు డివిజన్ రైల్వే యాజమాన్యం అధికారికంగా ఆర్‌పీఎఫ్‌కు బుధవారం అప్పగించింది.సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అలోక్ బొహ్రా పచ్చ జెండా ఊపి వీటిని ప్రారంభించారు. డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్ ప్రకాష్ దుబే తదితరులు పాల్గొన్నారు.

## 'యువ దర్శకులు రాణించాలి '

డాబాగార్డెన్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : యువ దర్శకులు సినిమా రంగంలో నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న రాణించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఫ్యామిలీ ఫ్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో ఆర్కే మీడియా హౌస్ సహ సమర్పణలో వైజాగ్‌కు చెందిన యువ దర్శకుడు రత్నం రామ్‌గోపాల్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రొడక్షన్ నెం 3 చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైజాగ్ కళాకారులకు పుట్టినిల్లు,ఇక్కడ నుంచి ఎంతోమంది దర్శకులు, సాంకేతిక నిపుణులు, రచయితలు సినిమా రంగంలో పేరుప్రఖ్యాతలు తెచ్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కే మీడియా అధినేత రవికాంత్, సీనియర్ జర్నలిస్ట్ బాలకృష్ణ, కవి, రచయిత సత్తివాడ శ్రీకాంత్, నాని, రిషి పాల్గొన్నారు.

## జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులకు జాతీయ అవార్డులను అందించేందుకు వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు జె. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ సేషనల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో వీటిని అందించనున్నట్టు వెల్లడించారు. ఈనెల 15 నుంచి జులై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి పని చేస్తున్న వ్యక్తులు, సంస్థలు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అప్లికేషన్లు / నామినేషన్లను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామన్నారు. ఎంపికైన వారికి డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జాతీయ అవార్డులు ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు.

## ఎన్‌ఎంసీహెచ్ హెచ్‌ఎంగా కొత్తల రాము

సీతమ్మధార, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ జీవీఎంసీ పాఠశాలహెచ్‌ఎంగా కొత్తల రాము బాధ్యత స్వీకరించారు.ఆయన రైల్వే న్యూకాలనీలోని కేఎన్‌ఎం మహిళ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహించి ఇక్కడికి విచ్చేశారు. పాఠశాలలో వసతులు కల్పించి విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

# నగరం కాలుష్యమయం

(5వ పేజీ తరువాయి)

నుంచి యార్డులకు బొగ్గు దిగుమతి సమయంలో ధూళి ఎక్కువగా వ్యాపిస్తోంది. తిరిగి యార్డులో రైళ్లు, లారీలకు లోడింగ్ చేసేటప్పుడు కూడా నల్లని ధూళి నగరంపైకి వస్తోంది. యార్డులపై టార్పాలిన్లు కప్పుతున్నా గాలికి టార్పాలిన్లు ఎగిరినప్పుడు, టార్పాలిన్లు కప్పని యార్డుల నుంచి ధూళి గాలిలో కలుస్తోంది. నిరంతరం నీటిని స్ప్రే చేస్తున్నామని చెబుతున్నా ధూళి మాత్రం తగ్గడం లేదు. పోర్టు యాజమాన్యం ఇటీవల జ్ఞానాపురం ఫ్లైఓవర్‌కు ఆనుకుని ఖాళీ ప్రదేశాలలో స్టాకు పాయింట్లు ఏర్పాటుచేసింది. పోర్టుతో పాటు ఆ ప్రాంతంలో గల ఎస్సార్ స్టీల్స్, రెయిన్‌కాల్సింగ్, ఇతర పరిశ్రమల నుంచి పెద్దఎత్తున వస్తున్న కాలుష్యం నగరవాసులను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది.

### అదుపుతప్పిన వాహన, భవన నిర్మాణాల కాలుష్యం

నగరంలో అన్నిరకాల వాహనాలు కలిపి పది లక్షలకు మించి ఉన్నాయి. వీటిలో కాలంచెల్లిన వాహనాల నుంచి విపరీతమైన పొగ వెలువడుతోంది. పోర్టు, ఇతర పరిశ్రమలకు సరుకు రవాణా కోసం వచ్చిపోయే వాహనాల నుంచి కాలుష్యం పరిమితికి మించి నమోదవుతుంది. అదేవిధంగా నగరంలో పాత భవనాలు కూల్చే సమయంలో ధూళి ఎక్కువగా వస్తోంది. నగరంలో రోజూ వచ్చే మురుగునీటిని శుద్ధి చేయకుండా సముద్రంలో కలిపేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

### ప్లాస్టిక్ రహిత నగరం సాధ్యం కాదు

నగరంలో మురుగుకాల్వలు, గెడ్డలు, చివరకు సముద్రతీరం పూర్తిగా ప్లాస్టిక్‌తో నిండిపోతున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే గెడ్డల్లో ప్లాస్టిక్ చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది.

### పీఎం 10, పీఎం 2.5 సగటుకు మించి నమోదు

గాలిలో ధూళి కాలుష్యాన్ని పరిమాణం బట్టి పీఎం-10, పీఎం- 2.5గా కొలుస్తారు. శ్వాస పీల్చుకునే సమయంలో ముక్కు రంధ్రం వద్ద ఉండిపోయినవి పీఎం 10 (సూక్ష్మమైనది) కాగా, గాలి పీల్చుకునేటప్పుడు ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయేవి పీఎం 2.5 (అత్యంత సూక్ష్మంగా ఉంటుంది). పీఎం 10 అయితే 24 గంటల సగటు 100, ఏడాది సగటు 60, పీఎం 2.5 అయితే 24 గంటల సగటు 60, ఏడాది సగటు 40 (మిల్లీగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటరు) నమోదు కావాలి. కానీ నగరంలో ఏడాదిలో సగం రోజులు సగటుకు మించి నమోదవుతున్నాయి.

### కాలుష్య తీవ్రత అరికట్టేందుకు చర్యలు

నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. పోర్టు నుంచి ధూళి వెలువడకుండా బొగ్గు నిల్వకు షెడ్ల నిర్మాణం జరుగుతుంది. ఇప్పటివరకూ 15శాతం షెడ్ల నిర్మాణం పూర్తికాగా ఈ ఏడాది చివరికల్లా మరో 15 శాతం అందుబాటులోకి వస్తాయి. వచ్చే రెండేళ్లలో పూర్తిగా షెడ్లలోనే బొగ్గు నిల్వ చేసేలా పోర్టు కార్యాచరణ ఖరారు చేసింది. ఇక నగరంలో రోడ్లు విస్తరించడం, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం ద్వారా వాహన కాలుష్యం తగ్గుతుంది. ప్రస్తుతం కాలుష్యంలో ఎవరి వాటా ఎంత? అనే అంశంపై ఏయూ పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన అధ్యయనం త్వరలో పూర్తికానున్నది. దాని ఆధారంగా కాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నాం.

పి.ముకుందరావు, ఈఈ
ఏపీ కాలుష్య నియంత్రణ మండలి



హోమం జరుపుతున్న వేదపండితులు

## వైభవంగా బాలాజీ దివ్యక్షేత్ర వార్షికోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ద్వితీయ వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దివ్యక్షేత్ర ప్రధానార్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు విశ్వక్సేన పూజ చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. బుధవారం ఆలయంలో ప్రత్యేక హోమాలు చేశాక వేదపండితులు గరుడ ప్రతిష్ఠ చేసి భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. పూజల్లో ఎస్టీబీఎల్ ఛైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు దంపతులతో పాటు ట్రస్టీలు జీవీ కృష్ణయ్య, వి.జీవన్‌బాబు, పి.సుబ్బారావుతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేడు ఆలయం ప్రారంభం

అగనంపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అన్నపూర్ణానగర్‌లో నిర్మించిన శ్రీపూర్ణ మహా గణపతి ఆలయాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్టు ఆలయ కమిటీ, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించాక ఆలయాన్ని ప్రారంభించడంతో పాటు శ్రీపూర్ణ మహా గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

## రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి

అగనంపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల ద్వారా లబ్ధిదారులకు సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని సర్కిల్-3 పౌర సరఫరాల సహాయ అధికారి టి.కృష్ణ సూచించారు. అగనంపూడి ప్రాంతంలో గల కొండయ్యవలస, పెదమడక రేషన్ డిపోలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను, రేషన్ అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు.

అనంతరం ఆయన డీలర్లతో కలిసి వెళ్లి వృద్ధులు, దివ్యాంగులకు సరకులను అందజేశారు. డీలర్లు సమయపాలన పాటిస్తూ సక్రమంగా రేషన్ సరకులను ప్రజలకు అందజేయాలని పేర్కొన్నారు. తూనికల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సివిల్ సప్లై ఆర్ఐ కె.లక్ష్మి, తదితరులు ఉన్నారు.

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అగనంపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ 85వ వార్డు నాయకుడు ఇల్లపు ప్రసాద్ అన్నారు. పినమడక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురికి పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అండిబోయిన మంగరాజు, కె.రమణ, బి.సత్యనారాయణ, దిలీప్, అంగన్‌వాడీలు సాయి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **కరాటే కిడ్** : శారద
- **ఏస్** : లీలామహల్,
- **ఫైనల్ డెస్టినేషన్** : రమాదేవి,
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 19, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 34 దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 44, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, కీరదోస 34, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండచిసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 535 |
| విజయనగరం | 539 |
| శ్రీకాకుళం | 539 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 90 |
| లైవ్ ధర | 110 |
| విత్ స్కిన్ | 190 |
| స్కిన్‌లెస్ | 200 |



పాత గాజువాకలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కోన తాతారావు, తదితరులు



వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న బొండా జగన్

# ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారు..

**» 'కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది' కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్, జనసేన నేత కోన తాతారావు**

గాజువాక, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనను అంతమొందించి ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకుని ఏడాది పూర్తవ్వడంతో ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారని డీసీసీబీ ఛైర్మన్, జనసేన నేత కోన తాతారావు అన్నారు. ప్రజా తీర్పును గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం జన సంక్షేమంగా ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి పాత గాజువాక జంక్షన్‌లో దీపాలు వెలిగించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 24 రాష్ట్ర రాజకీయ చరిత్రలో నిలిచిపోయిన రోజుగా పేర్కొన్నారు. ఓటు హక్కుతో ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడారన్నారు. దశాబ్ద కాలంగా ఎన్నో అవమానాలు, దాడులను ఎదుర్కొని జనసైనికులు పార్టీకి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడసాల అప్పారావు, నాయకులు తిప్పల రమణారెడ్డి, కోన చినఅప్పారావు, చైతన్యకృష్ణ, గోవింద్, గోపీచంద్, ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

**87వ వార్డులో బొండా జగన్ ఆధ్వర్యంలో..**

**కూర్మన్నపాలెం:** కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది అయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో రాష్ట్రం అధోగతి పాలైతే కూటమి ప్రభుత్వం గాడిన పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఏడాది పాలనలో సుమారు 70 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, డీవీ అప్పారావు, వర్రె రాంబాబు, ఎస్.పెంటారావు, పి.దానయ్య, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**అక్కిరెడ్డిపాలెం:** రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి అధికారంలోకి కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయిందని, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పాలన సాగుతుందని టీడీపీ జిల్లా నాయకుడు ఈటి శ్రీను అన్నారు. మింది కాలనీలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఇది మంచి ప్రభుత్వం అంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు పి.తిరుమల, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ నియోజకవర్గంగా గాజువాకను తీర్చిదిద్దుతాం

**» మేయర్ పీలా శ్రీనివాసరావు**



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీలా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు పలు ప్రణాళికలను సిద్ధం చేశామని, మోడల్ నియోజకవర్గంగా దీనిని తీర్చిదిద్దుతామని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన 88వ వార్డు పరిధి యాదవ జగ్గరాజుపేట, మంగళపాలెం, ఇందిరానగర్, దువ్వాడ సెక్టార్-1 పరదేశమ్మకాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో పర్యటించి రూ.కోటీ 44 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విశాఖ నగరాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాజువాకను అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తామన్నారు. యాదవ జగ్గరాజుపేటలో రూ.19.95 లక్షలతో, దువ్వాడ సెక్టార్-1లో రూ.40.62 లక్షలు, ఇందిరానగర్‌లో రూ.43.98 లక్షలు, పరదేశమ్మ కాలనీలో రూ.19.98 లక్షలు, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో రూ.19.98 లక్షలతో సీసీ డ్రెయిన్లు, కల్వర్టులు, ప్రహరీలు, కమ్యూనిటీ హాళ్లకు కార్పొరేటర్ ఎం.ముత్యాలనాయుడుతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. వార్డులో తాగునీటి, వీధిలైట్లు, బస్సు సౌకర్యం, శ్మశానవాటిక సమస్యలను పరిష్కరించవలసిందిగా మేయర్‌కు కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్సీ బీఆర్ఎస్ శేషాద్రి, ఇంజనీర్ ఎంఆర్ఎస్ అప్పారావు, స్థానిక నాయకులు ఉరుకూటి శ్రీనివాస్, గొలగాని సన్యాసిరావు, ఎం.రాము, తదితరులు పాల్గొన్నారు.

## పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బెల్ హెచ్‌పీవీపీలో కార్మికులు ఎదుర్కొంటున్న పీఎఫ్ తప్పిదాల సమస్యను పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని అఖిలభారత బీఎంఎస్ అధ్యక్షుడు హిరణ్మయి పాండ్యాకు కంపెనీ బీఎంఎస్ నాయకులు కోరారు. బుధవారం బెల్ హెచ్‌పీవీపీకి ఆయనను కార్మిక నాయకులు కలిసి పీఎఫ్ సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. బీహెచ్‌పీవీలో 1991లో చేరిన ఆర్-సిరీస్, టీ-సిరీస్ కార్మికులను రెగ్యులరైజ్ చేసే సమయంలో వారి జాయినింగ్ తేదీల నమోదులో జరిగిన పొరపాట్ల వల్ల పీఎఫ్‌ను తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడంతో పాటు కర్మాగారంలో హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పాండ్యాను కలిసిన వారిలో నాయకులు ముత్యాలు, లోవరెడ్డి, ప్రసాద్, రమేశ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## గెడ్డల్లో వ్యర్థాల తొలగింపు

కూర్మన్నపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని గెడ్డల్లో పూరుకుపోయిన వ్యర్థాలను బుధవారం తొలగించారు. పూడికతో గెడ్డలు నిండిపోవడంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు కార్పొరేటర్ బొండా జగన్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీంతో ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావుకు త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరడంతో గెడ్డల్లోని పూడికలను తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన కార్పొరేటర్‌కు, అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మానం ఆంజనేయులు

## ఆదర్శనీయుడు కొవిరి ధనరాజు

**మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నేత మానం ఆంజనేయులు**

పెదగంట్యాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీపీఐ బలోపేతానికి ఎంతో కృషి చేసిన కొవిరి ధనరాజు ఆదర్శనీయులని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మానం ఆంజనేయులు అన్నారు. గంగవరంలో బుధవారం జరిగిన సీపీఐ నాయకుడు కొవిరి ధనరాజు సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ధనరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మానం ఆంజనేయులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగిగా, సీపీఐ నేతగా కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ధనరాజు ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్‌రెహమాన్ మాట్లాడుతూ పార్టీ విధి విధానాలను అనుసరిస్తూనే ధనరాజు సమస్యలపై పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రనేత చలసాని రాఘవేంద్రరావు, నాయకులు పి.చంద్రశేఖర్, ఎం.పైడిరాజు, కసిరెడ్డి సత్యనారాయణ, వనజాక్షి, డి.ఆదినారాయణ, ఎం.జగ్గునాయుడు, పి.పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కూర్మన్నపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వడ్లపూడి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 6వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-2 ఈఈ టీకే నాయుడు, ఏఈ వీర్రాజులు తెలిపారు. ఈ కారణంగా వడ్లపూడి, లక్ష్మీపురం, తిరుమల నగర్, శ్రీగణేశ్ నగర్, సీడబ్ల్యూసీ లైన్, గవర వీధి, సిద్ధార్థ నగర్, అపెరల్ పార్కు, ఆటోనగర్ ఈ-బ్లాక్, శెట్టిబలిజవీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## దివ్యాంగులకు పుస్తకాలు, నిత్యావసరాల పంపిణీ

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ ఉన్నతంగా జీవించాలన్నదే ప్రధాన ధ్యేయంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని స్టీల్‌ప్లాంట్ సృష్టి స్కూల్ డైరెక్టర్ పి.సుశీలరాణి అన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా ఇచా ఫౌండేషన్‌లో విద్యార్థులకు, దివ్యాంగులకు పుస్తకాలు, తినుబండారాలు, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలను ఢీకొన్న వ్యాన్

అక్కిరెడ్డిపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ కూడలి నుంచి మిందికి వెళ్లే రోడ్డులో బుధవారం అదుపు తప్పిన ఓ వ్యాన్ పార్కింగులో ఉన్న ఆరు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. మింది రోడ్డులో గల ఓ స్క్రాప్ దుకాణానికి చెందిన వ్యాన్ ఉదయం మింది వైపు వెళుతూ కార్ల షోరూమ్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొనడంతో అవి బాగా దెబ్బతిన్నాయి. ఆ వాహనాలకు మరమ్మతులు చేయించేందుకు వ్యాన్ యజమాని అంగీకరించినట్టు తెలిసింది.

## 'హామీలను కూటమి నేతలు నెరవేర్చాలి'

పెదగంట్యాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి నాయకులు నెరవేర్చాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి డిమాండ్ చేశారు. బుధవారం గంగవరంలో జరిగిన జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవంలో ఆమె పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం బెల్టు షాపులు అధికమయ్యాయని, వీటిని తొలగించాలని కోరారు. సభ్యులు పి.పద్మ, కొండమ్మ, ధనలక్ష్మి, దేవుడమ్మ, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

**» హామీలన్నీ అమలు చేస్తాం: ఎమ్మెల్యే పి.గణబాబు**



సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్న పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

పెందుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పట్టిన జగన్ పీడ విరగడై సుపరిపాలన మొదలై ఏడాది గడుస్తోందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు బుధవారం మండలంలోని పెదగాడిలో 'పీడ విరగడై ఏడాది' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా రంగవల్లులు, గాలిపటాలు, గంగిరెద్దు ఆటలు, హరిదాసుల సంకీర్తలనలతో జనసేన కార్యకర్తలను అలరించాయి. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ ఏపీలో వైసీపీ అరాచక పాలనకు విసుగుచెందిన ప్రజలు 11స్థానాలకే పరిమితం చేసి ప్రతిపక్షం కూడా దక్కనివ్వలేదని అన్నారు. కూటమి హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా నిలుస్తుందని అన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలు కార్యరూపం దాల్చడానికి సిద్ధంగా ఉన్నాయని, దీపం సిలెండర్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాజధాని, పోలవరం నిర్మాణాలతో రాష్ట్రానికి మహర్దశ పట్టబోతుందని అన్నారు. పెందుర్తిలోనే 150 కోట్ల అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. వెన్నుపోటు దినం అని వైసీపీ గగ్గోలు పెడుతోందని, కానీ రాష్ట్ర ప్రజలు మాత్రం సంతోషంగా ఉన్నారని, అందుకే సంక్రాంతి, దీపావళి సంబరాలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జనసేన సంక్రాంతి సంబరాల్లో తెలుగుతనం ఉట్టిపడేలా ఎమ్మెల్యే పంచకర్ల పంచె కట్టారు. జానపద కళాకారులతో డప్పు కొట్టి నృత్యం చేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

**మల్కాపురం:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా శ్రీహరిపురంలో జనసేన ముఖ్య ప్రతినిధి అంగ దుర్గా ప్రశాంతి సంబరాలను నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీహరిపురం జీవీఎంసీ మైదానంలో వేదిక ఏర్పాటు చేసి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, కాకరపువత్తులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని గణబాబు పేర్కొన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో చాలా నష్టం జరిగిందని, దానిని కూటమి భరిస్తోందని ఆయన అన్నారు. త్వరలోనే అర్హులకు టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్న పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

**వేపగుంట:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలోని సింహాద్రినగర్‌లో బుధవారం సాయంత్రం టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విశాఖ పార్లమెంట్ టీడీపీ మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.శోభారాణి ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం, మాట తప్పని కూటమి ప్రభుత్వం' పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ మాట్లాడుతూ విధ్వంస పాలనకు చరమగీతం పాడి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన రోజని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజలు ఇప్పుడు ప్రశాంతంగా జీవిస్తున్నారని శోభారాణి అన్నారు. జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మీనగర్‌లో స్థానిక టీడీపీ నాయకుడు వర్మ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట స్థానికులకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దాట్ల మధు కేక్ కట్ చేశారు.

## 'మంత్రి అనిత బాధ్యతను విస్మరించారు'

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో ముగ్గురు దళిత యువకులను పోలీసులు బహిరంగంగా దండించడాన్ని తప్పుబట్టాల్సిన హోమ్ శాఖ మంత్రి అనిత ఆ బాధ్యతను విస్మరించి, పోలీసులకు మద్దతుగా మాట్లాడటం తగదని మానవ హక్కుల ఫోరం బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించింది. తెనాలి పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంది. తప్పు చేసిన వారికి కులం, మతం ఉండవని మంత్రి పేర్కొన్నారని, దీని ద్వారా ఆమె కుల గుర్తింపును తోసిపుచ్చినట్టయిందని ఫోరమ్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి వెంటనే అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ట్రాక్ నిర్మాణంలో భూములు నష్టపోయిన రైతుల వివరాలు వెల్లడి



భూముల వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

పెందుర్తి రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : సింహాచలం రైల్వేస్టేషన్ నుంచి లక్ష్మీపురం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల వరకు కొత్త రైల్ ట్రాక్ నిర్మాణంలో భూములను కోల్పోయిన రైతుల వివరాలను బుధవారం పొర్లుపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో ఆర్డీవో శ్రీలేఖ వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీలేఖ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చాలా వరకు భూములు సింహాచలం దేవస్థానం పరిధిలో ఉన్నట్లు 1996లో దేవస్థానం అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారని చెప్పారు. 'దీనిపై రైతులు ఎవరైన అభ్యంతరాలను వ్యక్తం చేశారా?' అని ప్రశ్నించారు. భూములపై తమకున్న హక్కుల గురించి అప్పట్లోనే దేవస్థానానికి లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చామని బాధిత రైతు సంఘం అధ్యక్షుడు గల్లా వెంకటరమణ తెలిపారు. ట్రాక్ నిర్మాణానికి సంబంధించి పొర్లుపాలెం, చింతలఅగ్రహారం, చీమలపల్లి గ్రామాలకు చెందిన 92 మంది రైతులు 10 ఎకరాల భూమిని కోల్పోతున్నారని, వారికి నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఆర్డీవో పేర్కొన్నారు. ఈ భూముల్లో తాము ఇళ్ల స్థలాలను కొనుగోలు చేశామని, తమకూ నష్టపరిహారం వచ్చేలా చూడాలని పలువురు రైతులు ఆర్డీవోను కోరారు. ఈ సభలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ టి.దివ్య, వీఆర్వో డి.ముత్యాలశెట్టి, రెవెన్యూ అధికారులు, దేవస్థానం ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు: అదీప్‌రాజ్



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఓట్లు వేసిన ప్రజలను వెన్నుపోటు పొడిచారని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గ వైసీపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ చేసుకుంటూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ సంపద సృష్టిస్తామని డప్పు కొట్టి అధికారంలోకి వచ్చిన తరువాత చేతులెత్తేశారని, వైసీపీ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని అన్నారు. అమలు కాని హామీలతో కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. చంద్రబాబు ప్రజలను మోసం చేశారంటూ నినాదాలు చేశారు. సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు అదీప్‌రాజ్ వినతిపత్రాన్ని అందిజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ఉప్పిలి కనకరాజు, పైలా సన్యాసిరాజు, ఎంపీపీ సభ్యులు మధుపాడ నాగమణి, అంజి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

**మల్కాపురంలో**

**మల్కాపురం:** జీవీఎంసీ 40, 58 నుంచి 63 వార్డుల్లో పశ్చిమ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుధవారం 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ నాయకులు గాజువాక ఆర్టీసీ డిపోకు చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా మళ్ల విజయ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని, ఈ మోసాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో గెలిచారని ఆయన అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మోసాన్ని ప్రజలు గుర్తించారని, కూటమిని ప్రజలు నమ్మరని ఆయన పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డుల వైసీపీ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణపై కళాజాత ప్రదర్శన



కాలుష్య నియంత్రణపై ప్రదర్శన చేస్తున్న కళాకారులు

గోపాలపట్నం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు కళాజాత కళాకారులు స్థానిక రైతు బజార్‌లో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను, పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతుబజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్, కళాజాత కళాకారులు పాల్గొన్నారు.

## 'ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి'

మల్కాపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్ని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వచ్చే కలిగే అనర్థాలు తెలియక ఇప్పటికీ దానిని వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కొత్త ఓటరు జాబితా



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న అధికారి శేషశైలజ

పెందుర్తి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలో పారదర్శకమైన ఓటరు జాబిత తయారు చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శేషశైలజ పేర్కొన్నారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులో సమావేశం ఆమె మాట్లాడుతూ గతంలో ఓటరు జాబితాలో సవరణలు, కొత్త ఓటర్ల దరఖాస్తులను పునఃపరిశీలన చేయాలని అన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి నమోదు చేస్తామని వివరించారు. సమావేశంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎన్నికల డీటీ అర్జునరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దృఢ సంకల్పంతో అనితర సాధ్యమే

## సాహసకృత్యాలతో అదరహో

### ట్రెక్కింగ్, సైక్లింగ్, మోటార్ సైక్లింగ్స్‌లో సత్తా చాటిన అనితారావ్

- మూడు వేల కిలోమీటర్ల మోటార్ సైకిల్ యాత్ర పూర్తి
- 57 ఏళ్ల వయసులో నెరవేర్చుకున్న చిన్ననాటి సంకల్పం
- ఎంఎఫ్ఏ పూర్తి..సైకాలజిస్ట్‌గా గుర్తింపు



లాహోల్‌లో చంద్రబగ్గ నది వద్ద డాక్టర్ అనితారావ్

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన డాక్టర్ అనితారావ్ సాహస కృత్యాల (అడ్వెంచర్ యాక్టివిటీస్)తో అదర గొడుతున్నారు. 57 ఏళ్ల వయసులోనూ విభిన్నమైన సాహసాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. చిన్నప్పటి నుంచి అభిరుచి, ఆసక్తి ఉన్నా చదువు, ఇతర వ్యాపకాల కారణంగా కల సాకారం చేసుకోలేకపోయారు. ఉద్యోగం, వ్యాపారం, పిల్లల పెంపకం తరువాత దొరికిన ఖాళీ సమయాన్ని తన సంకల్పాన్ని సాకారం చేసుకునేందుకు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలోనే సాహసకృత్యాలు చేయడంతోపాటు చిన్న వయసులో చదవలేకపోయిన బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ కోర్సులు పూర్తి చేశారు. ఇప్పటికే సైకాలజిస్టుగా మానసిక వైద్య సేవలు అందిస్తున్న ఆమె థియేటర్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో తాను వేసిన చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో అనేక విషయాలను పంచుకున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే...

తొలి నుంచి సాహసకృత్యాలంటే చాలా ఇష్టం. చదువు, పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల వాటికి దూరంగా ఉండాల్సి వచ్చింది. పిల్లల విద్యాభ్యాసం పూర్తయి, అందరూ ఉద్యోగాల్లో ఉన్నారు. ఇప్పుడిప్పుడే ఖాళీ సమయం దొరుకుతుండడంతో తొలి నుంచి ఇష్టం ఉన్న సాహస కృత్యాలపై దృష్టి సారించాను. అనేక సంస్థలతో కలిసి నిర్వహించే ట్రెక్కింగ్‌లో పాల్గొంటాను. ఇప్పటి వరకు అనేక ప్రాంతాల్లో నిర్వహించిన ట్రెక్కింగ్‌కు వెళ్లాను.

### అక్కడ వద్దనుకుని ఏయూలో..

ముంబయిలోని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో సీటు వచ్చింది. మహారాష్ట్రేతర వ్యక్తులకు ఒకే ఒక్క సీటు ఉంటుంది. ఆ ఒక్క సీటు ఎంట్రన్స్ టెస్ట్‌లో వచ్చింది. అయితే, అక్కడ సీటు వద్దనుకుని ఏయూలోని ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో చేరాను. ఇక్కడ నచ్చిన కోర్సు పూర్తి చేయడం ఆనందంగా ఉంది. సాధారణంగా మహిళలకు అనేక సవాళ్లు, ఇబ్బందులు ఉంటాయి. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు వంటివన్నీ వారి కోరికలను నెరవేర్చనీయవు. కానీ, వారికి మనసులో ఆ బాధ ఉంటుంది. ఆ బాధను లేకుండా చేసే బాధ్యతను కుటుంబ సభ్యులే తీసుకోవాలి. ప్రతి మహిళలోనూ గొప్ప శక్తి, సామర్థ్యాలు ఉంటాయి. వాటిని గుర్తించి ప్రోత్సహించడం కుటుంబ సభ్యుల బాధ్యత.

తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీ దగ్గర ఉన్న మహిలీ కొండలపై ట్రెక్కింగ్‌కు వెళ్లాను. 9 వేల అడుగుల ఎత్తులో ఉంటుంది. మంచు కురుస్తుంది. యూత్ హాస్టల్స్ అసోసియేషన్‌తో కలిసి ఈ ట్రెక్కింగ్‌లో పాల్గొన్నాను. 2014లో గుజరాత్ నుంచి కేరళ వరకు 13 మంది మహిళలు కలిసి సైకిల్ యాత్ర చేశాం. వుమెన్ అడ్వెంచర్స్ ఇండియా సంస్థ ఈ యాత్ర నిర్వహించింది. అంతకుముందు 2009లో ఢిల్లీ నుంచి లే లఢాక్ వరకు మూడు వేల కిలో మీటర్లు బైక్ యాత్ర చేపట్టాం. వంద మందితో యూత్ హాస్టల్స్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాత్రలో ఇద్దరు మహిళలు మాత్రమే ఉండగా, ఏపీ నుంచి తానొక్కదాన్నే ఉన్నాను. నిరంతరం వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ట్రెక్కింగ్‌తోపాటు సైక్లింగ్, బైక్ యాత్రలకు వెళుతుంటాను.



మనాలి సమీపంలోని మహిలీ కొండపై మరో బృందంతో..

### బీఎఫ్ఏ కోర్సు పూర్తి

చిన్న వయసులోనే లలిత కళలు (ఫైన్ ఆర్ట్స్) చేయాలన్న కోరిక ఉండేది. అప్పట్లో ఈ కోర్సు చేయాలంటే కొంత ఖర్చవుతుందని తల్లిదండ్రులు వద్దన్నారు. ఆ తరువాత ఉన్నత చదువులు పూర్తి చేశాను. ఢిల్లీ యూనివర్సిటీలో సైకాలజీ చేసి ప్రస్తుతం సైకాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్నాను. అయితే, ఏదో చిన్న అసంతృప్తి. నచ్చిన కోర్సు చేయలేకపోయానన్న బాధ ఉండేది. ఆ బాధ జీవితాంతం ఉండకూడదన్న ఆలోచనతో 2019లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత ఏయూలోనే మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు కూడా పూర్తి చేశాను. ఇప్పుడు నాకు ఎంతో ఆనందంగా ఉంది. ప్రస్తుతం పీతాపురం కాలనీలో ప్రత్యేకంగా సిరామిక్ స్టూడియోను నడుపుతున్నాను. సిరామిక్‌తో విభిన్నమైన కళాకృతులను డిజైన్ చేస్తుంటా. నేవీలో పని చేసి పదవీ విరమణ చేసిన తన భర్త కమాండర్ డి రామకృష్ణ సహకారం ఎంతగానో ఉంది. ఆ యన సహకారంతోనే నచ్చిన కోర్సు చేయడం, అడ్వెంచర్ యాక్టివిటీస్‌లో పాల్గొనడం చేయగలుగుతున్నాను.



అత్యంత ఎత్తైన పాండవ్ మెట్ట వద్ద సాహస యాత్రికుల బృంద చిత్రం



## భలే భలే ఆటో..

నగరంలో తిరుగుతున్న ఒక ఆటో అందరినీ ఆకట్టుకుంటోంది. గాజువాకకు చెందిన సదరు ఆటో యజమాని/డ్రైవర్ డేవిడ్ వాహనాల వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని కొంతైనా తగ్గించాలన్న ఉద్దేశంతో 12 రకాల మొక్కలను ఏర్పాటు చేయించాడు. గడిచిన పదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నానని, కొంతైనా స్వచ్ఛమైన గాలిని అందించాలన్న ఉద్దేశంతో మొక్కలు ఏర్పాటు చేయించినట్టు డేవిడ్ తెలిపాడు. పైన మాత్రం ప్లాస్టిక్‌తో కూడిన పచ్చగడ్డి చాపను ఏర్పాటుచేశానన్నాడు. ఆటో ఎక్కిన ప్రయాణికులు మంచి ఆలోచన అంటూ ప్రోత్సహిస్తున్నారని, కొందరు సెల్ఫీలు తీసుకుంటున్నారని ఆనందాన్ని వ్యక్తం చేశాడు.

-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

క్రైం... crime news

## బావిలో మునిగి యువకుడి మృతి



ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

పెందుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని పెందుర్తి మండలం ముదపాకలో బుధవారం ఓ యువకుడు ప్రమాదవశాత్తూ బావిలో మునిగి వ్యక్తి మృతి చెందినట్లు సీఐ కెవీ సతీశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా తెర్లాంకు చెందిన పక్కి ప్రసాద్ (26) ముదపాకలోని ప్రభుత్వ గృహ నిర్మాణ లేఅవుట్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఎండ వేడిమి తాళలేక ప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు సహచర కూలీలతో సమీపంలోని బావిలో ఈతకు దిగారు. ప్రసాద్ మాత్రం కొంత సేపు తరువాత వస్తానని వారికి చెప్పడంతో ముగ్గురూ పనిలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ప్రసాద్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో బావి వద్దకు వచ్చారు. ఎక్కడా కనిపించకపోవడంతో బావిలో పడిపోయి ఉంటాడని భావించి పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బావిలోంచి అతని మృతదేహాన్ని బయటకు తీసి, ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

## శాంతి ఆశ్రమం కేసులో 22 మంది అరెస్టు

ఎంవీపీ కాలనీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం వివాదంలో పోలీసుల అరెస్టులు ఇంకా కొనసాగుతున్నాయి. సుమారు ఆరున్నర ఎకరాల స్థలం శాంతి ఆశ్రమానికే చెందుతుందని సాక్షాత్తు సుప్రీం కోర్టు తీర్పు వచ్చినా, పట్టు వదలకుండా ఈ వివాదంలో రౌడీ షీటర్లు తలదూర్చడంపై పోలీసు కమిషనర్ సీరియస్‌గా ఉండటంతోనే ఈ అరెస్టులు తప్పడం లేదని వినిపిస్తోంది. ఫిర్యాదు వచ్చినా, మొదట్లో ఇది చాలా చిన్న విషయంగా ఎంవీపీ పోలీసులు భావించి, సీరియస్ చర్యలు తీసుకోలేదు. రెండు వర్గాలు రౌడీ షీటర్లను రంగంలోకి దించినట్లు కమిషనర్‌కు సమాచారం అందడంతో ఇందులో తలదూర్చిన వారందరినీ జైలుకు పంపాల్సిందేనని ఆయన ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీరిని అరెస్టు చేస్తున్నారు. ముఖ్యంగా పరారైన రౌడీ షీటర్లను పట్టుకునే బాధ్యత టాస్క్‌ఫోర్సుకు అప్పగించడంతో, వారు పట్టుకున్నవారిని ఎంవీపీ పోలీసులు జైలుకు పంపించక తప్పలేదు. తాజాగా ఒక వర్గం రౌడీ షీటర్లకు నాయకుడిగా ఉన్న చిట్టిబాబు అలియాస్ చిట్టిమామును టాస్క్ ఫోర్స్ పోలీసులు వలవేసి పట్టుకున్నారు. ఇప్పటికే వైకాపా నాయకుడు జీవీ రామచంద్రరావుతో పాటు 22 మందిని జైలుకు పంపారు. ఇదే కేసులో ఇంకా అరెస్టులు మిగిలి ఉన్నాయని అంటున్నారు. ఈ కేసులో రౌడీ షీటర్లను భూ వివాదంలోకి దించడంలో రామచంద్రరావుది కీలకపాత్రగా పోలీసులు భావిస్తున్నారు. రౌడీ షీటర్లతో ఇతడు మాట్లాడిన మాటల రికార్డింగ్ పోలీసుల వద్ద ప్రధాన ఆధారంగా లభించినట్లు చెపుతున్నారు. రౌడీ షీటర్లను రంగంలోకి దించి, స్థలాన్ని ఒక వర్గానికి అప్పగించడానికి ఇతడు బేరం కుదుర్చుకున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## షార్టు సర్క్యూట్‌తో కారులో మంటలు

- జూ పార్కు సమీపంలో త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆరిలోవ జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు సమీపంలో కారులో మంటలు చేలరేగి పూర్తిగా కాలిపోయింది. లోపల వైర్ల షార్టు సర్క్యూట్ కారణంగా కారులో మంటలు చెలరేగాయని ఆరిలోవ సీఐ మల్లేశ్వరావు తెలిపారు. బుధవారం ఉదయం జూ పార్కు సమీపంలో ఈ సంఘటన జరిగింది. కారులో ప్రయాణిస్తున్న వారంతా త్రుటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. విజయనగరం నుంచి నగరంలోని డాక్ యార్డు వైపు వీరు వెళ్తున్నట్లు సీఐ తెలిపారు. కొద్దిగా మంటలు రావడంతో వారంతా కారు దిగి బయటకు వచ్చారు. ఈలోగా కారు అంతటికీ మంటలు వ్యాపించి ఆహుతయ్యిందని ఆయన తెలిపారు. అగ్ని మాపక శకటంవచ్చి మంటలను అదుపు చేసింది. ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జూ పార్కులో పెలికాన్ మృతి

ఆరిలోవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలోని శాంతి సరోవరం సమీపంలో ఒక పెలికాన్ పక్షి మృతి చెందింది. ఈ పక్షి బహుశా వడదెబ్బకు మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఇది రెండు రోజుల కిందట మృతి చెందినట్టు కనిపిస్తోంది. శాంతి సరోవరం సమీపంలోని ఓ చోట పెలికాన్ మృతకళేబరం పడి ఉంది. దీన్ని ఇక్కడ నుంచి వెంటనే తొలగించాల్సి ఉన్నప్పటికీ జూ సిబ్బంది గమనించినట్టు లేదు. దీంతో జూ సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## జలప్రసాదం కుళాయిలు చోరీ

సాగర్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రుషికొండలో ఉన్న టీటీడీ ఆలయం కొండ దిగువన జల ప్రసాదం కుళాయిలు చోరీకి గురయ్యాయి. కొండ దిగువన రాజువేగేశ్న ఫౌండేషన్ దాతల సహకారంతో జల ప్రసాదం పేరుతో రూ. లక్షలు వెచ్చించి మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసింది. ప్లాంట్ వద్ద స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు కుళాయిలు కూడా అమర్చారు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు కుళాయిల ట్యాప్‌లు పట్టుకుపోవడంతో ఆల యానికి వచ్చిన భక్తులు దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దాతలు రూ. లక్షల ఏర్పాటు చేసిన జలప్రసాదం వద్ద సెక్యూరిటీ లేకపోవడం వల్ల కుళాయిలు చోరీ అయ్యాయని భక్తులు ఆరోపిస్తున్నారు.

## ఎన్నికల హామీల అమలుకు ప్రజల తరపున పోరాడుతాం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న వైసీపీ నేతలు కె.కె.రాజు, గొల్ల బాబూరావు, తైనాల విజయ్‌కుమార్, వాసుపల్లి గణేష్‌కుమార్, వరుదు కల్యాణి తదితరులు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ప్రజల తరపున పోరాటం చేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ హామీలు అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు బుధవారం ఆ పార్టీ నేతలు కలెక్టరేట్ వద్ద 'వెన్నుపోటుదినం' పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు ముందుగా జిల్లా పరిషత్ కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఐదుగురు నేతలను మాత్రమే అనుమతించారు. కేకేరాజుతోపాటు రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మరి కొందరు వెళ్లి కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని కేకేరాజు అన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన అనేక సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం నిలిపేసిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో విద్యార్థులు ఉన్నతవిద్య అభ్యసించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేశారని, కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేకుండాపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల అమలుపై చర్చకు సిద్ధమా?

- వైసీపీకి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హామీలను ఏ పార్టీ అమలు చేసిందో బహిరంగ చర్చకు వైసీపీ సిద్ధమా? అంటూ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాల్ చేశారు. విశాఖపట్నంలోని తన స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏడాది కాలంలోనే ఎన్నికల హామీలను 80 శాతం వరకు అమలు చేసిన కూటమి ప్రభుత్వంపై జగన్ మోహన్ రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన 2019లో మేనిఫెస్టోలో ప్రకటించిన మద్య నిషేధం, ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ వంటి హామీలను అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేసిన విషయం మరిచిపోయారని, అందుకే ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో రహదారులపై ప్రయాణించడం కష్టంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపుగా 50 వేల గుంతలను పూడ్చి, వేల కిలోమీటర్ల రహదారులు పునర్నిర్మించిందన్నారు. వైసీపీ శ్మశానంగా మార్చిన అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా రూపుదిద్దుతున్నామన్నారు.

పోలవరం, మెట్రో రైలు, విశాఖపట్నం స్టీల్ ప్లాంటు వంటి కీలకమైన ప్రాజెక్టుల పురోగతిని గుర్తు చేశారు. ఒక్క ఏడాదిలోనే ఇన్ని అభివృద్ధి పనులు చేసినందుకా? జగన్ మోహన్ రెడ్డి 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆగస్టు నుంచి ఆర్‌టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వస్తుందని, ఈ నెలలోనే తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పీవీ నరసింహం, లొడగల అప్పారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జనసేన నాయకులు శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విశిష్టాద్వైత మత ప్రచారకులు ఆళ్వార్లలో ప్రముఖులు నమ్మాళ్వారు తిరు నక్షత్ర పూజలు పురస్కరించుకుని అప్పన్న స్వామి దర్శన వేళల్లో స్వల్ప మార్పులు చేశారు. తిరునక్షత్ర పూజలు ఈనెల 5న ప్రారంభమై 9వ తేదీతో పూర్తి కానున్నాయి. ఈ ఐదు రోజులు ప్రత్యేక ఆరాధనలు ఉండడంతో రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయి. అలాగే రాత్రి ఆరాధన టికెట్ల విక్రయాలు కూడా రద్దు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈనెల 10న నృసింహ జయంతి పురస్కరించుకుని సాయంత్రం 5 గంటల తరువాత దర్శనాలు లభించవు. 11న జేష్ఠమాస పూర్ణిమ సందర్భంగా స్వామివారికి మూడవ విడత చందన సమర్పణ జరగనున్నందున ఆ రోజు జరగాల్సిన అన్ని రకాల ఆర్జిత సేవలను కూడా రద్దు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.


## ఎంపెడా నైపుణ్య ఒలింపియాడ్ నేడు

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విలువ ఆధారిత సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, సముద్ర ఆహార విలువ జోడింపులో నైపుణ్య స్థాయి పెంపునకు సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి అథారిటీ (ఎంపెడా) అంతర్రాష్ట్ర నైపుణ్య ఒలింపియాడ్‌ను గురువారం నిర్వహించనుంది. ఈ కార్యక్రమం నిఫ్‌ఫాట్ క్యాంపస్‌లో జరగనుంది. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. అనంతరం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు నైపుణ్య మూల్యాంకన పరీక్ష జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్రాష్ట్ర నైపుణ్య ఒలింపియాడ్ విజేతలను సాయంత్రం ముగింపు కార్యక్రమంలో ప్రకటిస్తారని పేర్కొన్నారు.

## గుండెపోటుతో కళాకారుడు మృతి



విగతజీవిగా చప్ప కల్యాణ్



బాలకృష్ణ డూప్‌గా..

కంచిలి, పెదగంట్యాడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కంచిలి సమీపంలోని మఠం చెరువు వద్ద స్నానానికి వెళ్లిన విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలానికి చెందిన కళాకారుడు సప్ప కల్యాణ్(65) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. తోటి కళాకారులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో జరుగుతున్న కంచమ్మతల్లి సంబరాల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కల్యాణ్ వచ్చాడు. మంగళవారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలంలో బాలకృష్ణ డూప్‌గా నటించిన కల్యాణ్.. కంచిలి సంబరాల్లో పాల్గొనేందుకు బుధవారం వేకువజామున వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు మఠం చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు.